

104 మద్యం దుకాణాలకు నోటిఫికేషన్

11న లాటరీ ద్వారా కేటాయింపు

12నుంచి ప్రైవేట్ వైన్‌షాపులు ప్రారంభం



ఎక్సైజ్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తున్న కలెక్టర్ తదితరులు

చిత్తూరు సిటీ, అక్టోబరు 1: జిల్లాలో ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ సుమిత్ కుమార్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసి వివరాలను వెల్లడించారు. మంగళవారం ఉదయం 11 గంటల నుంచి ఈ నెల 9వ తేది వరకూ దరఖాస్తులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో స్వీకరిస్తారు. జిల్లాకు తొలి విడతలో 104 మద్యం దుకాణాలను కేటాయించారు. తర్వాత కల్లుగీత కార్మికులకు కేటాయించిన 10శాతం దుకాణాలకు నోటిఫికేషన్ విడుదల చేస్తారు. చిత్తూరులో ప్రీమియం బ్రాండ్లు విక్రయించేందుకు ఏర్పాటు చేసిన ఒక ఎలైట్ షాపుకు కూడా విడిగా నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. లాటరీలో లైసెన్స్ దక్కించుకున్న వ్యాపారులు ఏడాదిలో 6 విడతలుగా లైసెన్స్ ఫీజును కట్టుకునే వెసులుబాటు కల్పించారు. ఒక్కరోజు వ్యవధిలో మొదటి విడత లైసెన్స్ ఫీజు చెల్లించాలి. దరఖాస్తుదారుల సమక్షంలో అధికారులు దరఖాస్తులను లాటరీ ద్వారా తీసి దుకాణాలను కేటాయిస్తారు. 9వ తేది సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. 11వ తేది ఉదయం 8 గంటలకు చిత్తూరు సమీపంలోని దొడ్డిపల్లిలో ఉన్న చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీ కళ్యాణమండపంలో లాటరీ తీసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.12వ తేదీ నుంచి కొత్త మద్యం దుకాణాలు తెరుచుకుంటాయి. లైసెన్స్ గడువు రెండు సంవత్సరాలుగా నిర్ణయించారు. రెండో సంవత్సరం లైసెన్స్ ఫీజులో 10 శాతం అదనంగా కట్టాల్సి ఉంటుంది.ఆన్‌లైన్‌లో URL:http://hpfsproject.com ద్వారా దరఖాస్తు సమర్పించవచ్చు.ఇతర వివరాలకు ఎక్సైజ్ సీఐని సంప్రదించవచ్చు.

● లైసెన్స్ ఫీజు వివరాలిలా..

మద్యం దుకాణాలకు దరఖాస్తు రుసుం రూ.2 లక్షలుగా నిర్ణయించారు. ఒకరు ఎన్ని దుకాణాలకైనా దరఖాస్తు చేసుకోవచ్చు. దుకాణం దక్కించుకున్నా..దక్కించుకోకపోయినా..ఆ 2లక్షలు వెనక్కివ్వరు.10 వేల మంది లోపు జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.50 లక్షలు లైసెన్సు ఫీజుగా చెల్లించాలి. 10 వేలు దాటి 50 వేలమంది వరకు జనాభా ఉంటే రూ.55 లక్షలు, 50 వేల మందికి పైబడి 5 లక్షల వరకు జనాభా ఉన్న చోట రూ.65 లక్షలు, 5 లక్షల మందికి పైగా ఉన్న ప్రాంతాల్లో రూ.85 లక్షలు లైసెన్సు ఫీజుగా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఫీజును ఏడాదిలోపు ఆరు విడతల్లో చెల్లించేందుకు వ్యాపారులకు వెసులుబాటు కల్పించారు. ఏటా 10 శాతం పెంచుతారు. గతంలో మద్యం అమ్మకాలపై మార్జిన్ 10 శాతం ఉంటే ఇప్పుడు 20 శాతం పెంచారు.

● మండలాల వారీగా దుకాణాలు ఇలా..

చిత్తూరులో 14, నగరి, పలమనేరు, పుంగనూరుల్లో ఆరు చొప్పున ,బంగారుపాళ్యం,కుప్పం, మండలాల్లో ఐదు చొప్పున,గంగాధరనెల్లూరు,ఐరాల,విజయపురం,తవణంపల్లె మండలాల్లో నాలుగు చొప్పున, చౌడేపల్లె, పులిచెర్ల ,కార్వేటినగరం, పూతలపట్టు,యాదమరి, సోమల ,వి.కోటల్లో మూడు చొప్పున, బైరెడ్డిపల్లె, గంగవరం , గుడిపాల, పెద్దపంజాణి , పెనుమూరు , రామకుప్పం , రొంపిచెర్ల , శాంతిపురం , సదుం , ఎస్ఆర్ పురం , వెదురుకుప్పం మండలాల్లో రెండు చొప్పున, గుడుపల్లి , నింద్ర , పాలసముద్రం మండలాలకు ఒక్కో దుకాణం కేటాయించారు.

చిన్న ఆధారమూ దొరకలేదు!

పుంగనూరు బాలిక ఆచూకీ కోసం కొనసాగుతున్న పోలీసుల గాలింపు

డీఐజీ షిమోషి ఉన్నతస్థాయి సమీక్ష

రెండ్రోజులుగా పుంగనూరులోనే ఎస్పీ మకాం



ఆస్పియా

పుంగనూరు స్టేషన్ వద్ద పోలీసు అధికారులతో డీఐజీ షిముషీబాజ్‌పేయి

పుంగనూరు, అక్టోబరు 1:అదృశ్యమైన ఆరేళ్ల బాలిక ఆచూకీకి సంబంధించి చిన్న ఆధారమూ దొరక్కపోవడంతో పోలీసులు మల్లగుల్లాలు పడుతున్నారు. పుంగనూరు పట్టణంలోని ఉబేదుల్లా కాంపౌండ్‌లో కాపురం ఉండే వడ్డీ వ్యాపారి అజ్మతుల్లా కుమార్తె ఆస్పియా (6) ఆదివారం రాత్రి ఇంటి ఎదుట ఆడుకుంటూ కన్పించకుండా పోయిన విషయం తెలిసిందే. ఆస్పియా ఆచూకీ కోసం నేరపరిశోధనలో పేరుగాంచిన పోలీసు అధికారుల నేతృత్వంలో 11బృందాలు విస్తృత గాలింపు సాగిస్తున్నాయి.సోమ, మంగళవారాల్లో ఎస్పీ మణికంఠ పుంగనూరులోనే మకాం వేసి కేసు దర్యాప్తును పర్యవేక్షిస్తున్నారు.డీఎస్పీలు ప్రభాకర్, సాయినాథ్, ఇలియాస్‌బాషా, చిత్తూరు స్పెషల్ బ్రాంచి, పుంగనూరు సీసీఎస్, గంగవరం సీఐలు భాస్కర్, శ్రీనివాసులు, ఉమామహేశ్వరరావు,ప్రసాద్, పలువురు ఎస్ఐలు, కానిస్టేబుళ్లు గాలింపుతో పాటు ఆధారాల సేకరణలో నిమగ్నమయ్యారు. మంగళవారం మున్సిపల్ కార్మికులు, కొందరు యువకుల ద్వారా పట్టణం చుట్టూ ఉన్న కాల్వలు, బావులు, చెరువులు, ముళ్లపొదలు, అనుమానిత ప్రాంతాల్లో గాలించారు.పుంగనూరు పట్టణంతో పాటు శివార్లలోని సీసీ కెమెరాలను తనిఖీ చేశారు. బాలిక తండ్రి అజ్మతుల్లా వడ్డీ వ్యాపారి కావడంతో ఇటీవల వ్యాపారంలో ఏవైనా గొడవలు జరిగాయా అనే విషయాలపై ఆరా తీస్తున్నారు.సెల్‌ఫోన్ టవర్‌సిగ్నళ్లను విశ్లేషించడంతో పాటు, నేరచరిత్ర కలిగినవారి కదలికలపై వాకబు చేస్తున్నారు.అన్ని మార్గాల్లో అన్వేషిస్తున్నా చిన్నపాటి క్లూ కూడా లభించకపోవడంతో పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. విజయవాడ నుంచి సాంకేతిక పోలీసు బృందం వస్తున్నట్లు సమాచారం.

అన్ని కోణాల్లో దర్యాప్తు చేయండి:డీఐజీ

అదృశ్యమైన ఆస్పియా కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేయాలని డీఐజీ షిమోషిబాజ్‌పేయి ఆదేశించారు. మంగళవారం రాత్రి పుంగనూరు స్టేషన్‌లో ఆమె ఎస్పీ మణికంఠ, డీఎస్పీలు ప్రభాకర్, సాయినాథ్, ఇలియాస్‌బాషాలతో కేసు గురించి చర్చించారు. సున్నితమైన విషయం కావడంతో అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు.బాలిక తల్లిదండ్రులతో పాటు మరికొందరిని విచారించారు.

నీరసంగా ఉన్నా.. కాలిబాటనే..!

● తిరుమలకు చేరుకున్న డిప్యూటీ సీఎం

● భద్రతపై తొలుత పోలీసుల అభ్యంతరం
● అలిపిరి వద్ద అయోమయం
● చివరకు నడకమార్గాన్నే ఎంచుకున్న పవన్
● మార్గమధ్యంలో కాళ్ల నొప్పి బాధించినా వైద్యం చేయించుకుని నడక కొనసాగింపు



అలిపిరి పాదాల మండపం వద్ద కాలిబాటన బయలుదేరి

తిరుపతి/తిరుమల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన కారణంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నీరసంగా ఉన్నప్పటికీ.. నడక దారినే తిరుమల చేరుకున్నారు. 11 రోజుల దీక్ష విరమణకు గాను మంగళవారం మధ్యాహ్నం పవన్ తిరుపతికి చేరుకున్నారు. ప్రాయశ్చిత్త దీక్షలో ఉన్నందున తనకు స్వాగత సత్కారాలు అవసరం లేదని, హడావిడి, ఆర్భాటాలకు దూరంగా ఉండాలని జనసేన శ్రేణులకు, అభిమానులకు ఆదేశాలిచ్చారు. దీంతో విమానాశ్రయానికి ఎవరూ వెళ్ళలేదు. కేవలం కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు మాత్రమే పవన్‌కు స్వాగతం పలికారు. అక్కడ్నుంచి సాయంత్రం 4 గంటలకు అలిపిరి చేరుకున్నారు. నడక దారిలో వెళ్లాలంటే.. అటవీ మార్గం కావడంతో భద్రతా సమస్యలు ఎదురవుతాయని, ఇంటెలిజెన్స్ విభాగం కూడా హెచ్చరించిందని పోలీసులు తెలిపారు. అభిమానుల హడావిడితో పాటు భక్తులకూ ఇబ్బంది కలుగుతుందని వివరించారు. రోడ్డు మార్గాన వెళ్లాలని కోరారు. తనకు భద్రతాపరమైన సమస్య ఏమీ లేదని, నడిచే వెళతానని తొలుత భీష్మించినా.. చివరికి ఆయన డైలమాలో పడ్డారు. ఈ క్రమంలో వెనుదిరిగి పద్మావతి అతిథి గృహానికి వెళ్ళారు. శ్రీవారి మెట్టు మార్గమైతే ఎలా ఉంటుందని కాసేపు చర్చించారు. చివరకు అలిపిరి నడక దారినే ఎంచుకుని 4.50 గంటలకు పాదాల మండపం నుంచి బయల్దేరారు.

అలసి.. సొలసినా

ఆంజనేయస్వామి ఆలయం వద్దకు చేరేసరికి పవన్ కల్యాణ్ బాగా అలసిపోయి సొమ్మసిల్లిపోయారు. కాసేపు మెట్లపైనే ఒరిగిపోయినట్టు పడుకున్నారు. నీరసానికి తోడు వెన్ను, కాళ్ళ నొప్పితో ఇబ్బంది పడ్డారు. స్విమ్స్‌కు చెందిన వైద్యులతో ఫిజియో థెరపీ చేయించుకోవడంతోపాటు అక్కడక్కడా ఆగి విశ్రాంతి తీసుకుంటూ నడక సాగించారు. చివరికి నాలుగున్నర గంటల్లోనే అంటే రాత్రి 9.24 గంటలకు తిరుమల జీఎన్సీ టోల్‌గేట్ వద్దకు చేరుకున్నారు. జనసేన నేతలు పసుపులేటి హరిప్రసాద్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కుమారుడు మదన్, ప్రముఖ ఆర్కిటెక్చర్ ఆనంద్‌సాయి ఆయన వెంట తిరుమలకు చేరారు. కాగా, అభిమానుల తోపులాటలో సామాన్య భక్తులు అక్కడక్కడా ఇబ్బంది పడ్డారు. రోప్‌లతో భద్రతా సిబ్బంది నెట్టివేయడంతో జీఎన్సీ వద్ద అగచాట్లు పడ్డారు. చిన్నపిల్లలతో వచ్చిన భక్తులు నెట్టేస్తారనే భయంతో పవన్ కల్యాణ్ వెళ్లేంతవరకు నడకమార్గానికి దూరంగా నిలబడిపోయారు.



మార్గమధ్యంలో కాళ్ల నొప్పికి విశ్రాంతి తీసుకుంటూ..

దీంతో గంట పాటు అలిపిరి వద్ద అయోమయం నెలకొంది. పవన్ ఏ మార్గంలో వెళతారో తెలియక తొలుత 20 నిమిషాల పాటు భక్తులను నడక దారిలో ఆపేశారు. రోడ్డు మార్గాన వెళతారనే ఉద్దేశంతో అరగంట పాటు వాహనాలనూ నిలిపేశారు. దీంతో రెండు మార్గాల్లోనూ కొంతసేపు భక్తులు ఇబ్బంది పడ్డారు.

పవన్‌కు భారీ భద్రత

పవన్ కల్యాణ్ తిరుమల పర్యటనకు ప్రభుత్వం, టీటీడీ యంత్రాంగం భారీ భద్రత కల్పించింది. ఆయన వెంట నడక దారిలో వందమంది పోలీసులు వలయంగా ఏర్పడి రక్షణ కల్పించారు. దీనికి అదనంగా టీటీడీ సెక్యూరిటీ, ఎస్పీఎఫ్, ఏపీఎస్పీ, రిజర్వు పోలీసు బలగాలు బృందాలుగా ఏర్పడి ముందూవెనుక కూంబింగ్ నిర్వహిస్తూ సాగాయి.

పవన్‌ను కలిసిన అటవీశాఖ అధికారులు

అలిపిరి నడక మార్గంలోని లక్ష్మీనరసింహ ఆలయం వద్ద పవన్‌ను తిరుపతి సీఎఫ్‌వో నాగేశ్వరరావు, ఎస్వీ జూపార్కు పర్యవేక్షకుడు సెల్వం కలిశారు. నడక మార్గంలో చిన్నారి లక్షితపై చిరుత దాడి చేసిన తర్వాత తీసుకున్న చర్యలను వివరించారు. భవిష్యత్తులో చేపట్టబోయే పనులు, అభివృద్ధికి సంబంధించి మ్యాప్‌ను చూపి తెలియజేశారు.

రేపటినుంచి టెట్ పరీక్షలు

చిత్తూరు (సెంట్రల్), అక్టోబరు 1: టీచర్ ఎలిజిబులిటీ పరీక్ష (టెట్) గురువారం నుంచి ఈనెల 21వ తేదీ వరకు జరగనుంది. చెన్నైలో రెండు సెంటర్లు, జిల్లాలో నాలుగు సెంటర్లు ఏర్పాటు చేశారు. జిల్లాలో 5,893 మంది అభ్యర్థులు, చెన్నైలో 983 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు. రోజూ ఉదయం రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. నిమిషం ఆలస్యమైనా అనుమతించరు. అభ్యర్థులు తమ వెంట ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఓటరు గుర్తింపు కార్డులు తప్పనిసరిగా తీసుకురావాలి. దివ్యాంగులకు విద్యాశాఖాధికారి స్క్రైబ్‌ను ఏర్పాటు చేయడంతోపాటు నిబంధనల ప్రకారం 50 నిమిషాలు అదనపు పరీక్షా సమయం కేటాయిస్తారు. అభ్యర్థులు హాల్ టికెట్లను http://cse.ap.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. హాల్ టికెట్‌లో ఫొటో లేకపోయినా, సరిగ్గా కనిపించకపోయినా, అభ్యర్థి సరైన రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు డిపార్ట్‌మెంటల్ అధికారికి సమర్పించి అనుమతి పొందాలి. అభ్యర్థుల సందేహాలు నివృత్తికి డీఈవో కార్యాలయంలో 90321 85001 నెంబరులో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు.

తొలిరోజే 98శాతం పింఛన్ల పంపిణీ

చిత్తూరు (సెంట్రల్), అక్టోబరు 1: ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ తొలి రోజైన మంగళవారం జిల్లాలో 98.23 శాతం జరిగింది. ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం వరకు జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు జిల్లా వ్యాప్తంగా 2,68,434 మందికి గాను 2,63,185 (98 శాతం) మందికి పింఛన్లు అందజేశారు. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం ప్రభుత్వ సెలవు దినం కాగా, మిగిలిన 5249 మందికి గురువారం అందజేయనున్నారు.

ఉద్యోగులకు జీతాలొచ్చాయి

● రేపటినుంచి పెన్షనర్లకు

చిత్తూరు కలెక్టరేట్,అక్టోబరు 1: జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులకు మంగళవారం జీతాలు పడటం ప్రారంభమైంది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఠంచనుగా ఒకటో తేదీనే జీతాలిస్తామని నాయకులు ప్రకటించిన విషయం తెలిసిందే. జిల్లాలో 22,748 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రతి నెలా పదో తేదీ తర్వాతే జీతాలు అందేవి. దీంతో ఉద్యోగులు ఈఎంఐలు కట్టలేక ఇబ్బంది పడేవారు. ఇదిలా ఉండగా పెన్షనర్లకు మంగళవారం పింఛన్ డబ్బులు పడలేదు. జిల్లాలో 12,213 మంది ప్రభుత్వ పెన్షనర్లు ఉన్నారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా సెలవు దినం. గురువారం నుంచి పెన్షనర్లకు పింఛన్లు పడతామని ట్రెజరీ అధికారులు అంటున్నారు.

శాస్త్రోక్తంగా శ్రీవారి ఆలయ శుద్ధి



శ్రీవారి ఆలయ శుద్ధి కార్యక్రమంలో టీటీడీ ఈవో శ్యామలరావు తదితరులు

తిరుమల, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిగింది. ఈనెల 4వ నుంచి 12వ తేదీ వరకు జరగనున్న సాలకట్ల బ్రహ్మోత్సవాల నేపథ్యంలో మంగళవారం ఉదయం ఈ కార్యక్రమాన్ని ఆగమోక్తంగా నిర్వహించారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు ఆనందనిలయం నుంచి బంగారు వాకిలి వరకు, శ్రీవారి ఆలయంలోపల ఉన్న ఉపఆలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజాసామాగ్రిని నీటితో శుభ్రం చేశారు. ఈ సమయంలో స్వామివారి మూలవిరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పేశారు. శుద్ధి తర్వాత నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతా ప్రోక్షణం చేశారు. తర్వాత స్వామివారి మూలవిరాట్టుకు కప్పిఉన్న వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజలు, నైవేద్య కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఈ కార్యక్రమ నేపథ్యంలో మంగళవారం జరగాల్సిన అష్టదళ పాదపద్మారాధన, వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది.తిరుమంజనం కార్యక్రమంలో టీటీడీ ఈవో శ్యామలరావు,అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో గౌతమి, సీవీఎస్వో శ్రీధర్, డిప్యూటీఈవో లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

త్వరలో 900 టన్నుల ఎర్రచందనం వేలం

మంగళం, అక్టోబరు 1: అటవీశాఖ త్వరలో 900 టన్నుల ఎర్రచందనాన్ని గ్లోబల్ టెండర్ల ద్వారా వేలం వేయనుంది.తిరుపతిలోని తిమ్మినాయుడు పాళెం వద్ద గల సెంట్రల్ గోడౌన్‌లోని ఎర్రచందనాన్ని పీసీసీఎఫ్‌కే సుమన్ ఏర్పాటు చేసిన ధరల నిర్ణయ కమిటీ మంగళవారం పరిశీలించింది. గోదాములోని 50 లాట్లలో ఎర్రచందనం దుంగల గ్రేడ్లను పరిశీలించడంతోపాటు రంగులను రికార్డు చేశారు. ఎర్రచందనం విక్రయాల ద్వారా ఆదాయం పెంచుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. గతంలో ఏ గ్రేడ్ టన్ను రూ.65లక్షలనుంచి రూ.75లక్షల వరకు, బీ గ్రేడ్ రూ.30 లక్షల నుంచి రూ.35లక్షల వరకు, సీ గ్రేడ్ దుంగలు రూ.20లక్షల వరకూ పలికేవి. ఈ సారి ధరలను పెంచే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. గోదామును పరిశీలించిన కమిటీలో సీసీఎఫ్ నాగేశ్వరరావు, ఇన్‌చార్జి తిరుపతి జిల్లా అటవీశాఖ అధికారి సెల్వం, స్టేట్ సెల్వికల్చరిస్టు యశోదబాయి, సెంట్రల్ గోడౌన్ డీఎఫ్‌వో శివకుమార్ ఉన్నారు.



సెంట్రల్ గోడౌన్‌లో ఎర్రచందనాన్ని పరిశీలిస్తున్న ధరల నిర్ధారణ కమిటీ

ఎస్బీఐలో సర్వర్ డౌన్

● ఇబ్బందుల్లో ఖాతాదారులు

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 1: జిల్లా వ్యాప్తంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) పరిధిలో మంగళవారం ఉదయం నుంచి సర్వర్లు డౌన్ కావడంతో ఖాతాదారులు ఇబ్బంది పడ్డారు. నెల తొలిరోజు కావడంతో పలువురు ఖాతాదారులు ఎస్బీఐ బ్రాంచులకు వెళ్లగా గంటలకొద్దీ వేచి ఉండి, చివరకు వెనుదిరిగారు. సోమవారం కూడా కొన్ని బ్రాంచ్‌ల్లో సర్వర్ డౌన్ అయ్యిందని ఖాతాదారులు చెబుతున్నారు. చాలామంది ప్రభుత్వ ఉద్యోగులకు ఎస్బీఐలోనే ఖాతాలుండటంతో వీరికీ ఇబ్బందులు తప్పలేదు. కాగా, లోన్స్ సెక్షన్‌లో మాత్రమే సర్వర్ డౌన్ అయ్యిందని, మిగిలిన అన్నివిభాగాల్లో యథావిధిగా పనిచేసిందని బ్యాంకింగ్ అధికారవర్గాలు తెలిపాయి.




పేలుడుతో తలకిందులైన కారు - క్లైమోర్ మైన్‌లో వాడిన ఇనుప గోళాలు (ఇన్‌సెట్‌లో)





ధ్వంసమైన చంద్రబాబు కారు





విస్ఫోటనం తీవ్రతకు తెగిపడ్డ తీగలు - పేల్చడానికి వాడిన ఫ్లాష్ (ఇన్‌సెట్‌లో)

అలిపిరిలో ఆ క్షణం

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

చంద్రబాబుపై క్లైమోర్‌మైన్ దాడి జరిగి 21 ఏళ్లు

ఆ శబ్దం ఇప్పటికీ చెవుల్లో మోగుతోంది

పుత్తూరు అభివృద్ధి కోసం రూ.300కోట్లు కావాలని కోరుతూ ఒక ప్రణాళిక తయారు చేసుకున్నా. దానిని సీఎం చంద్రబాబుకు వివరించాలి. తిరుపతిలో కార్యక్రమాల ఒత్తిడిలో ఆయన ఉన్నందున సాధ్యం కాలేదు. తిరుమలకు వెళ్లేలోగా వివరించవచ్చని ఆయనతోపాటు కారులో ఎక్కి కూర్చున్నా. కాన్వాయ్ టోల్‌గేట్ దాటింది, మొదలుపెట్టబోతుండగా పెద్ద శబ్దం .. అంతే.. ఆ తర్వాత ఏమి జరిగిందో తెలియదు. నేను బతకడం కష్టమని వైద్యులు చెప్పేశారట. అయితే చంద్రబాబు ఢిల్లీ, బెంగళూరుల నుంచి నిపుణులైన వైద్యులను పిలిపించారు. హెలికాప్టర్ తెప్పించి హైదరాబాద్‌కు తరలించారు. సమయం పట్టినా కోలుకున్నా. అమ్మ నాకు తొలి జన్మనిస్తే, అలిపిరి ఘటన మలి జన్మనిచ్చింది. ఇది దేవుడిచ్చిన వరంగా భావిస్తుంటా.



- రెడ్డివారి రాజశేఖర్ రెడ్డి, అప్పటి పుత్తూరు ఎమ్మెల్యే

కారు 20 అడుగులు ఎగిరి పడింది



ఆరోజు సీఎం చంద్రబాబుతో పాటు ప్రయాణిస్తున్నా. హఠాత్తుగా కారు 20 అడుగులు పైకి ఎగిరి కిందపడింది. పెద్ద శబ్దం మాత్రమే వినిపించింది. ఆ తర్వాత స్పృహ వచ్చేసరికి ఆస్పత్రి బెడ్‌పై ఉన్నా. కోలుకున్న తర్వాత అలిపిరిలో జరిగిందేమిటో కథలు కథలుగా చెబుతుంటే, శ్రీవారి కరుణాకటాక్షాలతోనే బతికామని అనిపిస్తుంటుంది. ఎక్కడైతే ఘటన జరిగిందో, అక్కడే టోల్‌గేట్ నిర్మించారు. టీటీడీ ఛైర్మన్‌గా తిరుమలకు వెళ్తూ సంఘటన జరిగిన ప్రదేశాన్నే తదేకంగా చూస్తూ ఉండేవాడిని. వెంకటేశ్వరస్వామి ప్రసాదించిన మరో జన్మలో జీవిస్తున్నా.



- చదలవాడ కృష్ణమూర్తి, అప్పటి తిరుపతి ఎమ్మెల్యే

బ్లాస్ట్ .. సౌండ్.. దుమ్మూ...

సీఎం చంద్రబాబు స్విమ్స్ నుంచి తిరుమలకు బయలుదేరారు. లీడ్ కారులో డీఎస్పీ, నేనూ, మరో హెడ్ కానిస్టేబుల్ ఉన్నాం. టోల్‌గేట్ దాటుతుండగా వెనుక వస్తున్న వీఐపీ కారు మలుపు తిరిగిందా అని డీఎస్పీ చూడమన్నారు. నేను వెనక్కి తిరిగి చూస్తున్నా. పెద్ద బ్లాస్ట్ .. సౌండ్.. దుమ్మూ... బ్లాస్టింగ్ అని అర్థమైపోయింది. కారులోంచి దూకి వెనక్కి పరుగెత్తా. ఇంకా బాంబులుండచ్చు.. పేలచ్చు అని వారిస్తున్నా నేను వినలేదు. పొగలో ఎగిరి పడిపోయివున్న కారు వద్దకు చేరుకున్నా. ముందు సీటులో సీఎం పడిపోయి ఉన్నారు. వెనుక ముగ్గురు ఒకరిపై ఒకరు పడిపోయి ఉన్నారు. ముందుగా సీఎం గారిని కారులోనుంచి బయటకు తీశాం. అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకెళ్లాం. మరునటి రోజు పేలని మరో 12 క్లైమోర్ మైన్స్ అక్కడ బయటపడ్డాయి. అవికూడా పేలివుంటే ఎవ్వరమూ మిగిలివుండేవాళ్లం కాదు. ఉద్యోగంలో చేరిన తొలి రోజుల్లో అటువంటి పరిస్థితిని ఎదుర్కొనే శక్తిని ఆ స్వామే నాకు ఇచ్చాడనిపిస్తుంది.





- అంజూ యాదవ్, పోలీసు అధికారి

ఆ దృశ్యం మిగిలిపోయింది



టీవీ జర్నలిస్టుగా కాన్వాయ్‌తో పాటూ కొండకు బయలుదేరా. వెనుక కారులోంచి ముందుకు సాగిపోతున్న కార్ల బారును కెమెరాలో ఫోకస్ చేశా. ఇంతలో ఢాం.. అంటూ భారీ విస్ఫోటనం..ముందున్న కార్లు చెల్లాపెల్లాలుగా పడిపోయాయి. కార్లోంచి దూకి కెమెరాను ఫోకస్‌లోనే పట్టుకుని తెగి పడివున్న తీగలు దాటుకుంటూ ముందుకు పరుగు తీశా.నల్లటి పొగ కమ్ముకుని ఉంది. గాల్లోకి ఎగిరిన రాళ్ల ముక్కలు మీద పడుతున్నాయి. సీఎం కారు ఎక్కడా అని వెతుక్కుంటున్నా. ఆ దుమ్మూ పొగలోనే బోల్తాపడివున్న కారు చుట్టూ సీఎం సెక్యూరిటీ కోటలా చుట్టుకుని ఉన్నారు. పడమటి దిక్కున కొండల వెనుక సూర్యుడు అస్తమిస్తున్నాడు. ఎగిరి బోల్తాపడ్డ కారులోంచి చంద్రబాబును పైకి తీస్తున్నారు.. ఆ దృశ్యం నా కెమెరాలోనే కాదు నా గుండెల్లోనూ ఇప్పటికీ చెరగని ముద్రలా ఉండిపోయింది. మిగిలిన బాంబులు పేలివుంటే ఏమయ్యేది.. నేను చచ్చిపోయివుంటే మా అమ్మ ఏమైపోయేది.. అని ఆ తర్వాత తలుచుకుని వణికిపోయా.

- మునిరాజ, టీవీ జర్నలిస్టు

2003 అక్టోబరు1, సాయంత్రం 4.05 గంటలు..

అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుమలేశుడికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు తిరుమలకు బయలుదేరారు. అలిపిరి టోల్‌గేట్ దాటగానే భారీ పేలుడు.. ముఖ్యమంత్రి ప్రయాణిస్తున్న బులెట్ ప్రూఫ్ కారు ఆకాశంలోకి ఎగిరి పడింది. క్లైమోర్ మైన్స్‌తో అప్పటి పీపుల్స్‌వార్ నక్సలైట్లు చేసిన దాడి అది. కారులో చంద్రబాబుతో పాటూ అప్పటి మంత్రి బొజ్జల గోపాల కృష్ణారెడ్డి, ఎమ్మెల్యేలు చదలవాడ కృష్ణమూర్తి, రెడ్డివారి రాజశేఖర రెడ్డి కూడా ఉన్నారు. అంత భారీ పేలుడులోంచి చంద్రబాబు సహా అందరూ గాయాలతో బయటపడడం విచిత్రం. ఆ దేవదేవుడి కరుణగా ఇప్పటికీ చెప్పుకుంటారు. అలిపిరి సంఘటనలో బాధితులూ, ప్రత్యక్ష సాక్ష్యుల 21 ఏళ్ల కిందటి జ్ఞాపకాలు ఇవి...

తొలి ఫొటో నాదే!



చంద్రబాబు కాన్వాయ్ కొండకు బయలుదేరింది.వెనుక సెక్యూరిటీ కారులో నేనున్నా. 'దర్శనం ఎన్నిగంటలకు' అని పక్కనే ఉన్న సెక్యూరిటీ వాళ్లను అడుగుతూ ఉన్నా. ఇంతలో భారీ పేలుడు శబ్దం వినిపించింది. దట్టంగా పొగ.. అరుపులు..కేకలు.. కారులోంచి అందరం బయటకు దూకి సీఎం కారువైపు పరుగులు తీశాం. రోడ్డు పక్కన కాలువలో కారు పడిపోయివుంది. అప్రయత్నంగా నా చేతులు కెమెరాను ఎయిమ్ చేశాయి. సెక్యూరిటీ, పోలీసు సిబ్బందీ దెబ్బతిన్న కారులోంచి చంద్రబాబును పైకి తీస్తూ ఉన్నారు. క్లిక్..క్లిక్.. క్లిక్ మంటూ నా వేళ్లు నొక్కుతూనే ఉన్నాయి. ఇప్పటిలాగా అప్పుడు డిజిటల్ కెమెరాలు లేవు. ఫిలిం కెమెరాలే. దుమ్ము, పొగలో ఫొటోలు ఎలా వస్తాయో కూడా తెలీదు. టెన్షన్.. టెన్షన్. చివరికి ఆ ఫొటోలే అలిపిరి సంఘటనకు ప్రధానం అయ్యాయి. సంఘటన జరిగిన వెంటనే తీసిన తొలి ఫొటో నాదే అయ్యింది.

- మాధవ్, అప్పటి సీఎం అధికారిక ఫొటోగ్రాఫర్

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 1: జిల్లాలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. మంగళవారం సాయంత్రం రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి సత్యప్రసాద్ మంగళగిరి సీసీఎల్‌ఏ కార్యాలయం నుంచి ఫ్రీహోల్డ్ చేసిన భూముల పరిశీలన, ప్రజలనుంచి వచ్చిన అర్జీల పరిష్కారం, సుమోటోగా క్యాస్ట్ వెరిఫికేషన్ అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. చిత్తూరు నుంచి పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో భూసమస్యలు అధికశాతం కుటుంబసభ్యుల మధ్యే ఉన్నాయన్నారు. రీసర్వే, డీకేటీ పట్టాలు, ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడం వంటి కారణాలతో గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలు ఉత్పన్నమౌతున్నాయన్నారు. మంత్రి మాట్లాడుతూ.. గ్రీవెన్స్ ఎప్పటికప్పుడు జీరో స్థాయికి తీసుకుని రావాలన్నారు. కలెక్టరేట్ నుంచి జేసీ విద్యాధరి, డీఆర్వో పుల్లయ్య, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ గిరిబాబు పాల్గొన్నారు.

ఆయుధాలు వెనక్కిచ్చేలా ఆదేశించండి

- హైకోర్టును ఆశ్రయించిన పెద్దిరెడ్డి సోదరులు
- ప్రత్యర్థులపై వాటిని ప్రయోగించే అవకాశం
- అందుకే వెనక్కి ఇవ్వడం లేదు: పోలీసులు
- కౌంటర్ దాఖలు చేయాలని న్యాయమూర్తి ఆదేశం

అమరావతి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో పోలీసులకు తాము అప్పగించిన లైసెన్స్ ఆయుధాలను తిరిగి ఇచ్చేలా ఆదేశించాలని కోరుతూ వైసీపీ ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ద్వారకనాథ రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. వీరు దాఖలు చేసిన పిటిషన్లను విచారణకు స్వీకరించిన కోర్టు.. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. విచారణను ఈ నెల 14కి వాయిదా వేస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. పోలీసుల తరఫున న్యాయవాది కేఎం కృష్ణారెడ్డి స్పందిస్తూ.. పిటిషనర్లు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతాల్లో శాంతి భద్రతలు సునిశితంగా ఉన్నాయని, అధికార, ప్రతిపక్ష పార్టీల కార్యకర్తల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. ఈ కారణంగానే వారి ఆయుధాలు వెనక్కి ఇచ్చే విషయంలో పోలీసులు ఆచితూచి వ్యవహరిస్తున్నా రన్నారు. ప్రత్యర్థులపై ఆయుధాలు ప్రయోగిస్తారేమోనన్న ఆందోళన నెల కొందని తెలిపారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలతో కౌంటర్ వేస్తామ న్నారు. పిటిషనర్ల తరఫున న్యాయవాది వీఆర్ఎన్ ప్రశాంత్ వాదనలు వినిపిస్తూ.. ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత కూడా ఆయుధాలను అధి కారుల వద్దే ఉంచుకున్నారని, తిరిగి ఇవ్వాలని విన్నవించినా పట్టించుకోవడం లేదని తెలిపారు. పిటిషనర్ల ఆయుధాలు అన్నింటికీ లైసెన్సులు ఉన్నాయ న్నారు. లా అండ్ ఆర్డర్ పరంగా సున్నిత పరిస్థితులు ఉన్నాయని పోలీసులే చెబుతున్నారని, ప్రత్యర్థుల నుంచి ప్రాణహాని ఉన్న నేపథ్యంలో ఆయుధాలు వెనక్కి ఇచ్చేలా పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థించారు.

నెయ్యిలో కల్తీ వాస్తవమే.. కానీ జంతువుల కొవ్వు కాదు: చింతా

సూళ్లూరుపేట, అక్టోబరు 1: తిరుమల శ్రీవారి లడ్డూ తయారీకి వినియోగించే నెయ్యిలో కల్తీ వాస్తవమేనని, అయితే జంతువుల కొవ్వు కాదని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ అన్నారు. మంగళవారం సూళ్లూరుపేటలో ఆయన మీడియాతో మాట్లాడారు. లడ్డూ తయారీకి వినియోగించే నెయ్యిలో ఏమి కల్తీ చేశారో నిర్ధారించాక సీఎం చంద్రబాబు మాట్లాడి ఉండాల్సిందని, ఆయన తొందరపాటు వల్ల భక్తుల్లో అపోహలు కలిగాయన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీ పాలకవర్గం అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. కిలో ఆవు నెయ్యి రూ.700 పైచిలుకు ధర పలుకుతుంటే రూ.320కి ఎలా సరఫరా చేస్తారని ప్రశ్నించారు. కమీషన్లకు కక్కుర్తి పడి ఉన్న భవనాలను కూల్చి సత్రాల పేరుతో కొత్త నిర్మాణాలు చేపట్టారని విమర్శించారు.

నేడు, రేపు గ్రామసభలు

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 1: ప్రభుత్వ సూచనలతో బుధవారం గాంధీ జయంతి వేడుకలు అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభల ద్వారా నిర్వహించాలని ఈవోపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించినట్లు డీపీవో లక్ష్మి తెలిపారు. అలాగే గురువారం తప్పనిసరిగా ఉదయం తొమ్మిది నుంచి 11 గంటల మధ్య సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించాలని పేర్కొన్నారు. గ్రామసభల్లో తొలివిడతగా 11 మేజర్ గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న క్లాప్‌మిత్రలకు సన్మానించి, పాదరక్షలు, నూనె సీసాలు, దుస్తులు పంపిణీ జరుగుతుందన్నారు. కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని ఆదేశించినట్లు వివరించారు. ఇందుకయ్యే ఖర్చులను ఇటీవల విడుదల 15వ ఆర్థిక సంఘం నిధుల్లో అన్‌టైడ్ గ్రాంట్ నిధులను వినియోగించాలని సూచించారు.

రుయా డిప్యూటీ సీఎస్‌ఆర్‌ఎంవోగా శ్రీనివాస్

తిరుపతి(వైద్యం), అక్టోబరు 1: రుయాస్పత్రి డిప్యూటీ సీఎస్‌ఆర్‌ఎంవోగా డాక్టర్ శ్రీనివాసులను నియమిస్తూ డీఎంఈ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం రుయాస్పత్రిలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. డిప్యూటీ సీఎస్‌ఆర్‌ఎంవో బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌ను ఇన్‌చార్జి సీఎస్‌ఆర్‌ఎంవోగా నియమిస్తూ సూపరింటెండెంట్ రవిప్రభు ఉత్తర్వులు జారీ చేశారు. కొంత కాలంగా రుయాస్పత్రిలో రెగ్యులర్ సీఎస్‌ఆర్‌ఎంవో పోస్టును భర్తీ చేయకపోవడం వలన ఇన్‌చార్జి సీఎస్‌ఆర్‌ఎంవోగా శ్రీనివాసులకు బాధ్యతలు అప్పగించారు.

అల్లర్ల కేసులో బాధితులకు ఆర్థికసాయం



బాధితులకు చెక్కును అందిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, జడ్పీ ఛైర్మన్

- అమ్మాక్స్ సీఈవో రూ. 5.32 లక్షల చెక్కు అందజేత

వి.కోట, అక్టోబరు 1: వి.కోట అల్లర్ల ఘటన బాధితులకు రూ.5.32 లక్షల ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, కలెక్టర్ సుమిత్ కుమార్ అందజేశారు. వి.కోట ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధితులతో కలెక్టర్ మాట్లాడారు. వారి ఇబ్బందులను తెలుసు కున్నారు. 54 మంది బాధితులకు వీకోటకు చెందిన అమ్మాక్స్ సీఈవో దశరథరెడ్డి తన వంతు సాయంగా ఈ మొత్తాన్ని సమ కూర్చారు. నష్టపరిహారం సరిపడకుంటే రెవెన్యూ అధికారులకు సమస్యలను తెలియజేయాలని ఎమ్మెల్యే కోరారు. స్థానికంగా అన్ని వర్గాల ప్రజలు కలసి మెలసి ఉంటున్నారన్నారు. అలాంటి వాతా వరణమే కొనసాగాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఆకాంక్షించారు. శాంతి, భద్రతలకు విఘాతం కలిగితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. గతనెల 2న జరిగిన ఘటన బాధాకరమన్నారు. వినాయక చవితి, మిలాదున్ నబి పండుగలు మతసామరస్యంతో చేసుకోవడం ఇక్కడి ప్రజల సమైక్యభావనను తెలియజేస్తుందని జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు అన్నారు. తహసీల్దార్ పార్వతి, ఎంపీడీవో మహ్మద్ రఫీ, సీఐ సోమశేఖర్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ రామచంద్రనాయుడు ఉన్నారు.

బోయకొండ హుండీ ఆదాయం రూ.51.57 లక్షలు

చౌడేపల్లె, అక్టోబరు 1: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయానికి హుండీ ద్వారా రూ.51,57,968 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏకాంబరం తెలిపారు. మంగళవారం గంగమ్మ ఆలయంలో దేవదాయ అధికారులు, మదనపల్లె దేవదాయ ఇన్‌స్పెక్టర్ ఎస్.శశికుమార్, చౌడేపల్లె పోలీసులు, ఐసీఐసీఐ బ్యాంకు సిబ్బంది, దిగువపల్లె, దేవాలయ సిబ్బంది పర్యవేక్షణలో హుండీ లెక్కించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ 57 రోజులకగానూ నగదు రూపంలో 51,57,968, బంగారం 61 గ్రాములు, వెండి 450 గ్రాములు, ఉజ్బెకిస్తాన్ 1000 సైజ్ మూడు నోట్లు, 500 సైజ్ రెండు నోట్లు, సింగపూర్ పది డాలర్ల నోటు వచ్చాయన్నారు. రణభేరి గంగమ్మ ఆలయంలో రూ.35,502 ఆదాయం వచ్చిందన్నారు.



హుండీ లెక్కింపులో పాల్గొన్న బోయకొండ ఆలయ సిబ్బంది

వరసిద్ధుడి హుండీ ఆదాయం రూ.2.15 కోట్లు



ఈవో గురుప్రసాద్ పర్యవేక్షణలో స్వామి కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 1: స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.2,15,30,322 లభించింది. స్వామి కానుకలను ఈవో గురుప్రసాద్ పర్యవేక్షణలో మంగళవారం ఆలయ సిబ్బంది లెక్కించారు. ఈ ఆదాయంలో 90 గ్రాముల బంగారు, 1.295 కిలోల వెండి లభించినట్లు ఈవో తెలియజేశారు. అలాగే గోసంరక్షణ హుండీ ద్వారా రూ.29,513, అన్నదాన సత్రం వద్ద ఏర్పాటు చేసిన హుండీ ద్వారా రూ.44,159, బ్రహ్మోత్సవాల్లో నిర్వహించిన బిక్షాండి ద్వారా రూ.18,212 సమకూరినట్లు తెలియజేశారు. అలాగే 947 యూఏస్‌ఏ, 10 ఆస్ట్రేలియా, 110 కెనడా డాలర్లు, 120 యూఏఈ దిర్హామ్స్, 55 ఇంగ్లాండు పౌండ్లు, 406 మలేసియా రింగిట్స్, 150 యూరోలు హుండీ ద్వారా లభించినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఈనెల 3వ తేదీ నుంచి కాణిపాకంలో ప్రారంభం కానున్న శరన్నవరాత్రులకు ఆలయ ఉభయదారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. హుండీ లెక్కింపులో ఏఈవోలు రవీంద్రబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి, సూపరింటెండెంట్లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, బాలరంగస్వామి, సీఎఫ్‌వో నాగేశ్వరరావు, హుండీ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యం నాయుడు, ఆలయ, యూనియన్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

పుంగనూరులో కిలో టమోటా రూ.46

పుంగనూరు రూరల్, అక్టోబరు 1: పుంగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం కిలో టమోటా ధర రూ.46 పలికింది. కొద్దిరోజులుగా ధరలు పెరుగుతుండటంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. మొదటి రకం కిలో రూ.46, రెండోరకం కిలో రూ.43, మూడో రకం కిలో ధర రూ.40 చొప్పున యార్డుకు వచ్చిన 16.65 మెట్రిక్ టన్నుల టమోటాను వ్యాపారులు కొనుగోలు చేశారు. డిమాండ్ ఉన్న ప్రాంతాలకు తరలించారు.

తూతూమంత్రంగా వృద్ధుల దినోత్సవం

వృద్ధుల ఆవేదన

చిత్తూరు, అక్టోబరు 1: ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని తూతూమంత్రంగా జరిపించారని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏటా అక్టోబరు ఒకటో తేదీన ఈ కార్యక్రమం జరుగుతుంది. దీని నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం జిల్లాలో వృద్ధుల జనాభా ప్రకారం రూ.4లక్షల నుంచి రూ.6లక్షల వరకు విడుదల చేస్తుంది. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వృద్ధులను పిలవాలి. వీరి ఇబ్బందులను తెలుసుకోవడానికి జిల్లా జడ్జితో పాటు డీఎల్ఎస్ఏ అధికారులు, ఎంపీ, ఎమ్మెల్యేలను ఆహ్వానిస్తారు. సమావేశంలో వృద్ధుల సమస్యలను తెలుసుకుని అధికారులు చర్యలకు ఆదేశాలిస్తారు. అయితే ఏడేళ్లుగా జిల్లా వయోవృద్ధుల సంక్షేమశాఖ అధికారులు మాత్రం ఈ దినోత్సవాన్ని తూతూమంత్రంగా కానిచ్చేసి, భోజనం, టీ, స్నాక్స్ కోసం విడుదల చేసే నిధులను కూడా స్వాహా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

జరిపించారిలా..

మంగళవారం స్థానిక తపోవనంలో వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లాలో 2.68లక్షల మంది వృద్ధులు ఉన్నారు. వీరంతా రాకపోయినా చిత్తూరు నగరంలో ఉన్నవారిని ఆహ్వానించినా 500 మందికి తక్కువకాకుండా వచ్చేవారు. తపోవనంలో ఉన్న 20 మంది వృద్ధులతోనే ఈ కార్యక్రమాన్ని పూర్తిచేశారు. వీరికైనా భోజనం, టీ ఇచ్చారా అంటే అదీ లేదు. బెంగళూరుకు చెందిన ఓ దాత వితరణ చేసిన భోజనం, టీనే అధికారులు పెట్టినట్లు హంగామా చేసి వెళ్లిపోయారు. ఏడీ శ్రీనివాస్, వృద్ధులు శివకుమార్, కేశవులు తదితరులు హాజరై వృద్ధులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను అందజేస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేశారు.



వృద్ధుల దినోత్సవంలో ప్రసంగిస్తున్న కేశవులు

పంటలపై కొనసాగుతున్న గజదాడులు



తుడుంవారిపల్లి వద్ద ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరిపంట

కల్లూరు, అక్టోబరు1: పులిచెర్ల మండలంలో పం టలపై ఏనుగులు దాడులు కొనసాగుతు న్నాయి. పాత పాళెంగుట్ట, ముచ్చు గుట్ట, పాతపేట, కల్లూరు, దేవళం పేట, బోడిరెడ్డి గారిపల్లి, వెంకటదాసరపల్లి తదితర పంచాయతీల్లో పంటలను ధ్వంసం చేస్తున్నాయి. వరి, మామిడి, వేరుశనగ, టమోటా, అరటి తదితర పంటలకు నష్టం వాటిల్లు తోంది. సోమవారం రాత్రి దేవళంపేట పంచాయతీ తుడుంవారిపల్లి సమీపానికి చేరుకున్న ఆరు ఏనుగులు పంటలను నాశనం చేశాయి. తుడుంవారిపల్లిలోని కౌలు రైతు రాజన్న అర ఏకరా వరి పంట, రైతు శ్రీనివాసులుకు చెందిన పశుగ్రాసాన్ని ధ్వంసం చేశాయి. అనంతరం గ్రామానికి వెనుక ఉన్న గుట్టలోకి ఏనుగుల గుంపు వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. వీటి దాడులతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రేషన్ కార్డుదారులకు కందిపప్పు

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 1: రేషన్‌కార్డుదారులకు కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా నగదుకు కందిపప్పు సరఫరా మంగళవారం నుంచి ప్రారంభమైంది. ఏడాదిగా వైసీపీ ప్రభుత్వం కందిపప్పు పంపిణీకి మంగళం పాడిన విషయం తెలిసిందే. జిల్లాలోని కార్డుదారులకు 534 మెట్రిక్ టన్నుల కందిపప్పు పంపిణీ చేయనున్నారు. తొలి విడతగా మంగళవారం 30 టన్నుల కందిపప్పు రాగా.. వాటిని ఎండీయూ వాహనదారుల ద్వారా నగదుకు కిలో రూ.67కు పంపిణీ చేశారు. బహిరంగ మార్కెట్‌లో దాదాపు కిలో రూ.180 ఉండగా ప్రభుత్వం రెండుసార్లు ధరలను నియంత్రించి రూ.150కి అందించే ఏర్పాట్లు చేసింది.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

అభివృద్ధి పథంలో కుప్పం మున్సిపాలిటీ


గ్రామసభలో ప్రసంగిస్తున్న రాజ్‌కుమార్

కుప్పం, అక్టోబరు 1: పురపాలక సంఘం అభివృద్ధి పథంలో నడుస్తోందని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్‌లు అన్నారు. 21వ వార్డులో మంగళవారం ప్రజల వద్దకే మున్సిపాలిటీ గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలను వారి ఇళ్లవద్దకే వచ్చి పరిష్కరించేందుకే ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు అర్హులందరికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలను చేర్చడమే ధ్యేయంగా పనిచేసుకు వెళ్తున్నామన్నారు. వివిధ సమస్యలపై ప్రజలు అధికారులు అర్జీలు సమర్పించారు. త్వరలోనే పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు.

క్రీడాపోటీల్లో డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న సాగర్‌రాజ్

కుప్పం, అక్టోబరు 1: జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో హై జంప్ విభాగంలో కుప్పం డిగ్రీ కళాశాలలో బి.కామ్ తృతీయ సంవత్సర విద్యార్థిని టి.మౌనిక మొదటి స్థానంలో నిలిచినట్లు కళాశాల వైస్ ఛైర్మన్ సాగర్ రాజ్ తెలిపారు. షాట్‌పుట్‌లో ద్వితీయ సంవత్సరం ద్యార్థిని ఎం.దర్శిని ద్వితీయ స్థానం పొందిందన్నారు. వీరిద్దరూ ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు రాజమహేంద్రవరంలో జరగబోయే రాష్ట్రస్థాయి జూనియర్ క్రీడా పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ విద్యార్థినులను ఆయన అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డి.సుధారాణి, ఫిజికల్ డైరెక్టర్ సుధాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రోన్ల ద్వారా కీటకాల నివారణ చర్యలు


రైతులకు వివరిస్తున్న మహేశ్వరరెడ్డి

రొంపిచెర్ల,అక్టోబరు1: డ్రోన్ సహయంతో పొలాల్లోని క్రిమికీటక నివారణ చర్యలు తీసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయక్షేత్ర శాస్త్రవేత్త మహేశ్వరరెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ పాత కురవ పల్లె,పెద్ద కురవ పల్లె గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. పంటలకు సోకే తెగులు నివారణ అంశాల గురించి వ్యవసాయాధికారి సుధారాణి వివరించారు. వెంకటరమణనాయక్, అధికారులు సంపత్, వెంకటరమణ పాల్గొన్నారు.

వీధి కుక్కలతో జనం బెంబేలు


సోమల బస్టాండ్‌లో వీధికుక్కలు

సోమల, అక్టోబరు 1: మండల కేంద్రంలో వీధికుక్కలు భయభ్రాంతులు చేస్తున్నాయి. మంగళవారం బస్టాండ్ వద్ద తుగడంవారిపల్లెకు చెందిన రమణమ్మపై కుక్క దాడి చేసి గాయపర్చింది. ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స చేయించారు. ద్విచక్రవాహనంలో వెళ్తున్న మరోవ్యక్తిని వెంటాడి కాలుకు గాయం చేసింది. చిన్న పిల్లలు బడికి వెళ్లాలంటే భయపడుతున్నారు. వారి వెంట తల్లిదండ్రులు వెళ్తున్నారు. సోమల- నంజంపేట, తిరుపతి రోడ్డుపై వాహనదారుల వెంబడిస్తున్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు కుక్కర్లు, క్యాన్ల వితరణ



పలమనేరు, అక్టోబరు1 : పలమనేరు అర్బన్ సెక్టార్ పరిధిలోని 20 అంగన్‌వాడీ కేంద్రాలకు మంగళవారం దాతలు ప్రెజర్ కుక్కర్లు, వాటర్ క్యాన్లు, పిల్లలు కూర్చొనేందుకు మ్యాట్స్ అందజేశారు. స్థానిక గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో నాగమణి ఛారిటబుల్ ట్రస్టు, కొలమాసనపల్లిలోని రత్నాయోటెక్ సంస్థ సంయుక్తంగా వీటిని అందజేశాయి. కార్యక్రమంలో సంఘసేవకులు శ్రీపురం సీతారామయ్య, మాజీ కౌన్సిలర్ నరేంద్ర, ప్రవీణ్, శ్రీవల్లి, పద్మజలతో పాటు సీడీపీఓ ఇందిరాప్రియదర్శిని, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నజ్మాలు పాల్గొన్నారు. దాతలకు సీడీపీఓ, సూపర్‌వైజర్ నజ్మా కృతజ్ఞతలు తెలియజేశారు.

సేంద్రియ సాగుతో రైతుకు మేలు

చౌడేపల్లె, అక్టోబరు 1: రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని వ్యవసాయాధికారి పద్మజ పేర్కొన్నారు. మంగళవారం కొత్తకోట, దుర్గసముద్రం రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ప్రకృతి వ్యవసాయం గురించి వివరించారు.. కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ వెంకటరమణ, ఎంపీఈవో జయశ్రీ, ప్రకాష్‌బాబు, ఏఎస్‌వో రామిరెడ్డి నాయక్, మార్కెటింగ్ శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు. **సోమల:** రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏవో సుధాకర్ పేర్కొన్నారు. మంగళవారం తమ్మినాయనపల్లె, నెల్లిమందలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మాజీ సర్పంచు హరిప్రసాద్, పశువైద్యాధికారి చందనప్రియ, ఈవోపీఆర్డీ మహాలక్ష్మీ పాల్గొన్నారు.

వారాహి సభ విజయవంతానికి పిలుపు


మాట్లాడుతున్న జనసేన నాయకులు

పుంగనూరు రూరల్, అక్టోబరు1: తిరుపతిలో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పాల్గొనే వారాహి సభను విజయవంతం చేయాలని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల రమణ కోరారు. మంగళవారం పుంగనూరులో ఆయన మాట్లాడుతూ గురువారం సాయంత్రం 4 గంటలకు జ్యోతిరావుపులే సర్కిల్‌లో వారాహి సభ జరుగుతుందన్నారు. కార్యక్రమానికి జనసేన నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు విరూపాక్షి, నరేశ్‌రాయల్,చైతన్యరాయల్, హరినాయక్, బాలాజీనాయక్, శ్రీనివాసులు, శంకర్ పాల్గొన్నారు.

మద్యం దుకాణాల ముందు నిరసన



పలమనేరు, అక్టోబరు1 : పలమనేరులో మంగళవారం ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసే సిబ్బంది నిరసన కార్యక్రమం నిర్వహించారు. మద్యం దుకాణాలను మూసివేసి ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ నినాదాలు చేశారు. ఐదు సంవత్సరాలుగా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్నామని వీరు పేర్కొన్నారు. ప్రభుత్వం మద్యం దుకాణాలను ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టడం వలన ఉద్యోగాలు కోల్పోతున్నామన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



బైరెడ్డిపల్లె, అక్టోబరు 1 : మండలంలోని తీర్థం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం కోలార్ జాలప్ప ఆస్పత్రి వైద్యులు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. దీనికి విశేష స్పందన లభించింది. డాక్టర్ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో 50మందికి కంటిపరీక్షలు చేశారు. 17మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. డాక్టర్ హర్షిత, పీఆర్వో మమత, ఆరోగ్యవిద్యాధికారి కాంతమ్మ, సూపర్‌వైజర్ శ్రీదేవి, హెల్త్‌అసిస్టెంట్ రాజారెడ్డి, ఆయూబ్ పాల్గొన్నారు.

బిందు సేద్య పరికరాల పంపిణీ

శాంతిపురం, అక్టోబరు 1: మండల కేంద్రంలో మంగళవారం బిందుసేద్యం పరికారాల పంపిణీని మాజీ ఎమ్మెల్సీ గౌనివారిశ్రీనివాసులు, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి ప్రారంభించారు. రైతులకు 90శాతం రాయితీపై ఈ పరికరాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఏపీఎంఐపీ పీడీ బాలసుబ్రహ్మణ్యం, రామకుప్పం, శాంతిపురం మండలాల టీడీపీ అధ్యక్షులు ఆనందరెడ్డి, విశ్వనాథనాయుడు, రామకుప్పం మాజీ ఎంపీపీ చిన్నికృష్ణ, విజయరామిరెడ్డి, ఉద్యాన అధికారులు పాల్గొన్నారు.

ఆలయ భూముల కౌలుకు 5న వేలం

పలమనేరు, అక్టోబరు1 : పలమనేరు కాశీ విశ్వేశ్వరా స్వామి ఆలయానికి సంబంధించిన భూముల కౌలుకు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి కమలాకర్ తెలిపారు. ఈనెల 5న ఆలయం ఆవరణలో అధికారుల సమక్షంలో వేలం పాట నిర్వహిస్తామన్నారు. పాల్గొనేవారు డిపాజిట్ కింద రూ.1000 చెల్లించాలని, వేలం అనంతరం హెచ్చు వేలం పాటదారుడు వెంటనే డబ్బు చెల్లించి రసీదు పొందాల్సి ఉంటుందన్నారు.

నేడు ఉపాధి హామీ గ్రామ సభలు

సోమల, అక్టోబరు 1: మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం మండలంలోని 15 పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఏపీవో దినకర్‌బాబు తెలిపారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి పనులు కల్పిస్తామన్నారు. ఉపాధి నిధులతో పొలాల వద్ద పనులు చేసుకునేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

బగళనత్తం పాఠశాల తనిఖీ


విద్యార్థులతో మాట్లాడుతున్న శ్రీనివాసులురాజు

రామకుప్పం, అక్టోబరు 1: బగళనత్తం ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం ఆర్డీఓ శ్రీనివాసులురాజు తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆరోగ్యం, విద్యాభ్యాసం, క్రమశిక్షణ పట్ల అవగాహన కల్పించారు. ఎంఈఓ నారాయణ, ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, ఉపాధ్యాయులు ఆర్డీఓను సత్కరించారు.

రక్తదానంపై విద్యార్థులకు అవగాహన


ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

గంగవరం, అక్టోబరు 1 : జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా స్థానిక శ్రీవాణి విద్యాసంస్థల విద్యార్థులకు మధు కళాశాల ఆవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెడ్‌క్రాస్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ జయశంకర్, విజయ్‌కుమార్ రక్తదాన ప్రయోజనాలను వివరించారు. ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల కరస్పాండెంట్ క్రిష్ణమూర్తిరెడ్డి, అరుణకుమారి, సహదేవనాయుడు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై అట్రాసిటి కేసు నమోదు చేయాలి

పుంగనూరు రూరల్, అక్టోబరు1: అన్నమయ్య జిల్లా రామసముద్రం దళితవాడకు చెందిన దళితునిపై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని పుంగనూరు బీఎస్పీ నాయకుడు సురేష్ డిమాండ్ చేశారు. ఇక్కడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గోవిందును మంగళవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవిందును అదే గ్రామానికి చెందిన ఆదినారాయణరెడ్డి, ధనంజయరెడ్డి, రాము, ఉదయ్ కుమార్‌లు దాడి చేసి తిరిగి బాధితుడిపైనే కేసు పెట్టడం దారుణమన్నారు. న్యాయం చేయాల్సిన పోలీసులు అగ్రకులాల వారికి మద్దతు పలకడం సరికాదన్నారు.

ఉపాధి హామీ పనుల్లో ఇంత నిర్లక్ష్యమా

●డ్వామా ఏపీడీ ఆగ్రహం ●రూ.2.39 లక్షల రికవరీకి ఆదేశం


ఉపాధి సిబ్బందిని ప్రశ్నిస్తున్న డ్వామా ఏపీడీ ఉమావాణి

పుంగనూరు, అక్టోబరు1: జాతీయ ఉపాధి హామీ పనుల్లో మండలస్థాయి అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోందని చిత్తూరు డ్వామా అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉమావాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం పుంగనూరు జడ్పీ అతిథి గృహం ఆవరణలో 17వ విడత ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ఎస్‌ఆర్పీ పనులు పరిశీలించి లోపాలను గ్రామపంచాయతీ వారిగా చదివి వినిపించారు. మండలంలో పలుచోట్ల పనుల కొలతల్లో వ్యత్యాసాలు, పనివద్ద బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, అధిక నిధుల వినియోగం, నాటిన మొక్కలకు ఉన్న మొక్కలకు తేడా, ఒక మొక్కకు బదులుగా వేరే మొక్క చూపడం, హౌసింగ్ నిధుల దుర్వినియోగం, హార్టికల్చర్‌లో రోజా మొక్కలు లేకపోవడం, తదితర అవకతవకలను బయటపెట్టారు. వాటిలో కొన్నింటికి పనులు చేసినట్లు ఫొటోలు చూపడం, మార్పులు గురించి ఆధారాలను అదనపు పీడీకి అందజేశారు. పీడీ మాట్లాడుతూ ఉపాధి పనుల సిబ్బంది పనులు చేయించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. చెట్లు నాటిన రైతులను చైతన్య పరచాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు తీసుకోవాలన్నారు. మొక్కలు ఎండితే టెక్నికల్ అసిస్టెంట్లదే బాధ్యతన్నారు. మండలంలోని 23 పంచాయతీలలో తనిఖీలు నిర్వహించగా రూ.2,39,752 రికవరీకి ఆదేశించినట్లు ఎంపీడీవో అబ్దుల్ రహీమ్ తెలిపారు. సమావేశంలో ఏపీడీ రవికుమార్, ఎస్‌జెఎం లోకేశ్వర్‌రెడ్డి, ఎస్‌ఆర్పీ మల్లిఖార్జున, ఏపీవో శ్రీనివాసులు, ఇరిగేషన్ ఏఈ బాబురాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఉద్యోగుల బదిలీ..కార్యాలయం ఖాళీ

కుప్పం, అక్టోబరు 1: స్థానిక తహసీల్దారు కార్యాలయం ఇటీవల జరిగిన బదిలీలతో ఖాళీ అయింది. ఇక్కడున్న ఇద్దరు డీటీలు, ఒక సీనియర్ అసిస్టెంట్ ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. సర్వేయర్లు, ఆర్‌ఐలు మొదటి నుంచీ కూడా లేరు. ఆ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. పలమనేరునుంచి డీటీ సూర్యప్రకాశ్ బదిలీ మీద వచ్చి బాధ్యతలు స్వీకరించారు. మరో డీటీని ఇంకా కేటాయించలేదు. సర్వేయర్‌ను ఇతర ప్రాంతాలనుంచి కుప్పం బదిలీ చేసినా ఇంకా రాలేదు. ప్రస్తుతం ఒక డీటీ, ఇద్దరు సర్వేయర్లు, జూనియర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గంలోని ప్రధాన మండలమైన కుప్పంలోనే ఇన్ని కీలకమైన పోస్టులు ఖాళీ ఉన్నా ఉన్నతాధికారులు పట్టించుకోలేదనే విమర్శలున్నాయి. విజన్ డాక్యుమెంట్ పేరుతో నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళిక తుది దశలో మెరుగులు దిద్దుకుంటోంది. దానికి అనుగుణంగా వివిధ కంపెనీలకు, సంస్థలకు భూముల కేటాయింపు, భూ సర్వేలు చేయాల్సి ఉంది. ఇటువంటి కీలక దశలో తహసీల్దారు కార్యాలయంలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాల్సిన అవసరం ఉంది.

సీనియర్ సిటిజన్లకు న్యాయస్థానం ద్వారా భద్రత


మాట్లాడుతున్న జూనియర్ సివిల్‌జడ్జి లిఖిత

పలమనేరు, అక్టోబరు1 : సీనియర్ సిటిజన్ల సమస్యల పరిష్కారానికి, భద్రతకు కోర్టు సహకరిస్తుందని జూనియర్ సివిల్ జడ్జి లిఖిత పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కోర్టు ఆవరణలో సీనియర్ సిటిజన్స్‌కు న్యాయ విజ్ఞానసదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లిఖిత మాట్లాడుతూ పిల్లలు చూడకుండా గెంటివేస్తే కోర్టుకు వచ్చి నేరుగా ఫిర్యాదు చేస్తే వృద్ధులకు న్యాయం చేయడం జరుగుతుందన్నారు. పెన్షన్ సక్రమంగా అందకపోయినా ఫిర్యాదు చేయవచ్చన్నారు. సమావేశంలో మాజీ సైనికోద్యోగి సిద్దయ్య, విశ్రాంత తహసిల్దార్ క్రిష్ణమూర్తి, విశ్రాంత డీటీ మోహన్, రంగనాయకులు, వైనరేంద్ర, సురేంద్రప్రసాద్, ఈశ్వరాచారి, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ

పుంగనూరు రూరల్, అక్టోబరు1: వయసు పైబడిన ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ మధుసూదనాచారి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వృద్ధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఆర్‌ఎంవో హిమశైలజ, డాక్టర్లు రాహుల్, ప్రశాంత్, మాధవరెడ్డి, దేవి, నర్సింగ్ సూపర్‌వైజర్ భారతి, సిబ్బంది నాగేనాయక్, లలిత, సునీత తదితరులు పాల్గొన్నారు.

బోయకొండలో ఎస్టీలకు త్వరలో పట్టాల పంపిణీ


షికారిపాలెంతో మాట్లాడుతున్న జేసీ విద్యాధరి

చౌడేపల్లె, అక్టోబరు 1: బోయకొండలోని షికారీలకు త్వరలో పట్టాలు ఇవ్వనున్నట్లు జేసీ విద్యాధరి పేర్కొన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ 2003లో కొందరు ఎస్టీలకు పట్టాలు ఇచ్చినా వినియోగించుకోలేదన్నారు. షికారిపాళ్యంకు చెందిన కొందరు రైతుల భూములను పరిశీలించినట్లు తెలిపారు. పట్టాలు పొంది సాగు చేసుకుంటున్న వారికి పాస్ పుస్తకాలు ఇచ్చి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్టీలకు ప్రత్యేకంగా ఆధార్ నమోదు చేయాలన్నారు. తహసీల్దార్ హనుమంత్, సర్వేయర్ గుణ పాల్గొన్నారు.

వర్షం కోసం అమ్మవారికి పూజలు

రామకుప్పం, అక్టోబరు 1: వాన కురిపించాలని కోరుతూ మంగళవారం సల్లాపురమ్మను పట్టణ వీధుల్లో డప్పుల హోరు మధ్య ఊరేగించారు. ప్రతి ఇంటి ముందు కళ్ళాపి చల్లి, రంగవల్లులు దిద్ది అమ్మవారిని ఆహ్వానించారు. కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులిచ్చారు. **బైరెడ్డిపల్లె :** మండలంలోని పాతూరునత్తం గ్రామ సమీపంలోని గంగమ్మ ఆలయంలో మంగళవారం వర్షం కోసం గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు కురిపించి రైతుల కష్టాలు తీర్చాలని వేడుకుంటూ గంగమ్మకు జలాభిషేకం చేశారు.

ముత్యాలమ్మఆలయంలో నవరాత్రి పూజలు



రొంపిచెర్ల,అక్టోబరు1: పట్టణంలోని ముత్యాలమ్మ, కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో ఈనెల 4 నుంచి 13 వరకు దేవీ నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ చైర్మన్,సభ్యులు తెలిపారు. ముత్యాలమ్మ ఆలయంలో శుద్దోదిక, కుంకుమార్చన, మహామంగళ హారతి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సంప్రదాయ దుస్తులతో పాల్గొనాలని అర్చకులు గుణశేఖర తెలిపారు. అమ్మవారికి మంగళవారం పూజలు చేశారు.

బాధ్యతల స్వీకారం

పుంగనూరు రూరల్, అక్టోబరు1: పుంగనూరు ఏపీఎంగా కృష్ణప్ప బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న రవి బంగారుపాళ్యంకు బదిలీ అయ్యారు. పెద్దపంజాణి మండలంలో పని చేస్తున్న కృష్ణప్ప పుంగనూరుకు వచ్చారు. సీసీలు నాగరత్న, శివకుమార్, శారద బదిలీ కావడంతో పెద్దపంజాణి మండల సీసీలు చిన్నా, మునివెంకటప్ప, హేమలత, నూరుమహమ్మద్‌లు పుంగనూరుకు వచ్చారు. పట్టణ మెప్మా పీవోగా సోముశేఖర్, సీవోగా మాధవి వచ్చారు. **రొంపిచెర్ల:** ఎంపీడీవో కార్యాలయం సీనియర్ అసిస్టెంట్‌గా చల్లా సుధాకరరెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం నుంచి బదిలీపై వచ్చారని ఎంపీడీవో రెడ్డెప్పఆచారి చెప్పారు.

వ్యాసరచన,వక్తృత్వ పోటీలు


బహుమతులు అందజేస్తున్న డాక్టర్ పి. బాబు

పలమనేరు, అక్టోబరు1 : పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గాంధీ జయంతి సందర్భంగా మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలను, వక్తృత్వపోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలయిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. బాబు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపటి నుంచి తీర్థం రామచంద్రుడి బ్రహ్మోత్సవాలు

బైరెడ్డిపల్లె, అక్టోబరు 1 : తీర్థం గ్రామంలోని రామచంద్రస్వామి ఆలయంలో దసరా బ్రహ్మోత్సవాలు ఈనెల 3 నుంచి 12 వరకు నిర్వహించనున్నారు. 3వతేది ధ్వజారోహణం, కలశస్థాపన, మంటపోత్సవం, 4న హంస వాహనోత్సవం, 5న సూర్యప్రభ వాహనం, 6న శేషవాహనం, 7న సింహవాహనం, 8న హనుమంత వాహనం, 9న కల్యాణోత్సవం, గరుడోత్సవం, 10న గజవాహనం, 11న రథోత్సవం, 12న అశ్వవాహనం, 13న తోటోత్సవం జరుగుతాయని నిర్వాహకులు వివరించారు.

ఉపాధి పనుల పరిశీలన

శాంతిపురం, అక్టోబరు 1: మఠం పంచాయతీలో ఉపాధి హామీ పనులను మంగళవారం ఎంపీడీవో పరిశీలించారు. చెల్దిగానిచెరువులో క్యాటిల్‌పాండు పనులను తనిఖీ చేశారు. బుధవారం వంద ఫారం పాండ్‌లు పనులను ప్రారంభించనున్నట్టు ఆయన తెలిపారు.

ఆశా కార్యకర్తకు ఆర్థిక సాయం

సదుం, అక్టోబరు1: జాండ్రపేటకు చెందిన ఆశా కార్యకర హరినాగమ్మ కుమారుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. స్పందించిన తోటి ఆశా కార్యకర్తలు రూ.17వేలు మంగళవారం చెరుకువారిపల్లె పీహెచ్ వైద్యుడు గిరీష్ చేతుల మీదుగా అందజేశారు.

వృద్ధులకు ఆరోగ్య జాగ్రత్తలు

సదుం, అక్టోబరు1: స్థానిక పీహెచ్‌సీ వైద్యులు పుష్పకుమారి ఆధ్వర్యంలో మంగళవారం వృద్ధులకు ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వైద్యులు సూచించిన మందులను క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. శక్తికి మించిన పనులు చేయరాదన్నారు. స్థానిక సీఎస్సీలోని వైద్య సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వడివడిగా పింఛన్ల పంపిణీ


కంగుందిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో సాయి లహరి

కుప్పం, అక్టోబరు 1: పురపాలక సంఘంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, మండలంలో ఎంపీడీవో సాయి లహరి ఆధ్వర్యంలో మంగళవారం వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు విస్తృతంగా సామాజిక పింఛన్ల పంపిణీ చేపట్టారు. మున్సిపాలిటీ పరిధిలో 5023 సామాజిక భద్రతా పెన్షన్లు ఉండగా 98 శాతం పంపిణీ పూర్తి చేసినట్లు కమిషనర్ తెలిపారు. మండలంలో 91.56 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు సాయి లహరి చెప్పారు. మిగిలిన వారికి బుధవారం పంపిణీ చేస్తామన్నారు. ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావులు కూడా పంపిణీ చేశారు. **పలమనేరు:** మున్సిపాలిటీలో మంగళవారం 98.47 శాతం మందికి పెన్షన్లు పంపిణీ చేశామని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. 4625 మంది ఉండగా 4557 మందికి పంపిణీ చేశామన్నారు. 12 సచివాలయాల సిబ్బంది మంగళవారం ఉదయం నుంచి పెన్షన్ల పంపిణీలో పాల్గొన్నారన్నారు. **పుంగనూరు:** పట్టణంలో 98.55 శాతం మందికి పంపిణీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. 98 శాతం మందికి పింఛన్లు పంపిణీ జరిగిన రూరల్ మండలం జిల్లాలో అగ్రస్థానంలో నిలిచిందని ఎంపీడీవో అబ్దుల్ రహీం పేర్కొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు


మాట్లాడుతున్న ఆనందరెడ్డి

రామకుప్పం, అక్టోబరు 1: ఆధునిక పద్ధతులను అవలంభించడం ద్వారా అధిక, నాణ్యమైన వ్యవసాయ దిగుబడులు సాధించవచ్చని టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, కుప్పం సెరికల్చర్ ఏడీ హనుమంతప్పలు తెలిపారు. మంగళవారం బందార్లపల్లెలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పరికరాలు, యంత్రాలు సద్వినియోగం చేసుకుని ప్రగతిపథంలో పయనించాలన్నారు. మండల వ్యవసాయాధికారి అమృత, ఎంపీఈఓ తిప్పేస్వామి, శ్రీనాథరెడ్డి, పెరుమాళ్, సెక్షన్ ఇన్‌చార్జీ మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు: లాభసాటి వ్యవసాయం వైపు రైతులు దృష్టి సారించాలని ఏడీఏ మదుసూదన్‌రెడ్డి, వ్యవసాయ శాస్త్రవేత్త మహేశ్వర్‌రెడ్డి, ఏఓ శ్రీనివాస్ సూచించారు. పులిచెర్ల మండలం పాతపేట, దేవళంపేట పంచాయతీల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. **పలమనేరు:** మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ట్రైకో డెర్మావిరిడీ ఎరువు తయారీపై రైతులకు వ్యవసాయశాఖ అధికారి సంధ్య అవగాహన కల్పించారు. కూర్మాయి వద్ద రైతుల సమావేశం నిర్వహించారు. పంటల అధిక దిగుబడి సాధించేందుకు మెళకువలు తెలియజేశారు. కార్యక్రమంలో అభ్యుదయ రైతులు పెద్దబ్బ, క్రిష్టారెడ్డి, సీఎస్ నాయుడు, సుబ్రమణ్యంగౌడు, సెరికల్చర్ అధికారి, హెచ్‌ఓ లక్ష్మీప్రసన్న, రైతు సేవాసిబ్బంది కుమార్‌నాయుడు పాల్గొన్నారు.

చెకుముకి పోటీ విజేతలకు బహుమతుల ప్రదానం


పలమనేరులో విజేతలతో జనవిజ్ఞాన వేదిక నాయకులు, ఉపాధ్యాయులు

పలమనేరు, అక్టోబరు1 : సైన్సు విజ్ఞాన ఫలాలు అందరికీ అందాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు గిరిధరగుప్తా పేర్కొన్నారు. మంగళవారం పలమనేరు డివిజన్ స్థాయి చెకుముకి పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బాలికోన్నత పాఠశాల ఆవరణలో బహుమతులు అందజేశారు. డివిజన్ స్థాయి చెకుముకి పోటీల్లో ప్రయివేటు, ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి జీఎల్‌ఎస్ ఫారం, అరవింద్, మిస్బా, హైందవి, ప్రయివేటు పాఠశాలల నుంచి యూనివర్సల్ పాఠశాల విద్యార్థిని లిఖిత, హేజిత, మోక్షిత, పలమనేరు బాలికోన్నత పాఠశాల విద్యార్థిని అక్షయ, హుమేరా, భావన, ఓఎల్‌ఎల్ పాఠశాల విద్యార్థులు బుష్రా, రిహాన్ నయీమా, ఎంపికయ్యారని జిల్లా కోశాధికారి కె. సుదర్శనాచారి తెలిపారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక పట్టణ కార్యదర్శి పీసీ బాబు, గౌరవాధ్యక్షుడు శ్రీపురం సీతారామయ్య, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి చెకుముఖి పోటీలకు ఎంపిక

పుంగనూరు రూరల్,అక్టోబరు1: జిల్లా స్థాయి చెకుముకి పోటీలకు పుంగనూరు విద్యార్థులు ఎంపికైనట్లు మున్సిపల్ పాఠశాల హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం స్థానిక కొత్తయిండ్ల మున్సిపల్ పాఠశాల ఆవరణలో మండల స్థాయిలో సైన్స్‌పై చెకుముఖి పోటీ నిర్వహించారు. సాయిశ్రావణి, కె. హనీష్ రెడ్డి, ఎస్. సాకీబ్‌లు ఎంపికైనట్లు తెలిపారు. వీరికి గూడూరుపల్లె పాఠశాల హెచ్‌ఎం మహేష్‌నారాయణ, జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు సుశీల, హేమలతలు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. **కల్లూరు:** చెకుముకి పోటీలకు కల్లూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు ముగ్గురు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం శ్రీవాణి తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు వేణుగోపాల్, రాజేంద్ర, వెంకటశిద్దులు ఆధ్వర్యంలో కల్లూరు, పులిచెర్ల, మంగళంపేట, ఎల్లంకివారిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు మండల స్థాయిలో చెకుముకి పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన కల్లూరు విద్యార్థులు కుస్నిహాజ్, గౌతమి, దీక్షితలు జిల్లా స్థాయి చెకుముకి పోటీలకు ఎంపికయ్యారు.

బైరెడ్డిపల్లె : బైరెడ్డిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఎంఈవో సుబ్రమణ్యం బహుమతులు అందజేశారు. విజేతలుగా నిలిచిన కమ్మనపల్లె గురుకుల పాఠశాల, కడపనత్తం జడ్పీఉన్నత పాఠశాల, ప్రైవేటు పాఠశాలల విభాగంలో అగస్త్య పబ్లిక్‌స్కూల్ విద్యార్థులను అభినందించారు. జేవీవీ మండల కన్వీనర్ శశికుమార్, పాఠశాలల హెచ్‌ఎంలు నసీబ్‌జాన్, గౌహర్‌సుల్తానా, ప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **రామకుప్పం:** మండల స్థాయి చెకుముఖి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ఆనిగానూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు చైత్ర, కార్తీక్, రమ్యలు ప్రథమ స్థానంలో నిలిచారు. ప్రధానోపాధ్యాయుడు ఇంద్రప్రకాష్‌రెడ్డి, ఎస్‌ఎంసీ ఛైర్మన్ బీరప్ప వీరిని అభినందించారు.

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటుపరం కానీయొద్దు

టీడీపీ, జనసేన అడ్డుకోవాలి: సీపీఐ



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

చిత్తూరు రూరల్, అక్టోబరు 1: విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటుపరం కాకుండా టీడీపీ, జనసేన అడ్డుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. విశాఖ ఉక్కును అదానీ, అంబానీలకు కట్టబెట్టాలని బీజేపీ చూస్తోందని ఆరోపించారు. టీడీపీ, జనసేన నాయకులు కలిసికట్టుగా విశాఖ ఉక్కును ప్రైవేటుపరం కాకుండా ఆపాలని కోరారు. నాయకులు ఆర్ముగం, రమాదేవి, విజయకుమార్, రఘు, జమీలాబీ తదితరులు పాల్గొన్నారు.

మంగళ విద్యావాణి సంచిక ఆవిష్కరణ



బంగారుపాళ్యం, అక్టోబరు 1: మంగళపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం 29వ మంగళ విద్యావాణి సంచికను దాతలు ఆవిష్కరించారు. ఈ సంచికకు దాతలుగా తిరుపతికి చెందిన గీతాంజలి, సుధాకర పిళ్ళై, రుషేంద్రపతిరెడ్డి వ్యవహరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం రాజ్యలక్ష్మి మాట్లాడుతూ.. హిందీ బాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈసంచికను హిందీలో తేవడం జరిగిందని చెప్పారు. ఉపాధ్యాయులు అరుణశివప్రసాద్, రమాదేవి, పిళ్ళారప్ప పాల్గొన్నారు.

డయాలసిస్ కేంద్రంలో పరిశీలన



బాధితురాలిని పలకరించిన ఎన్‌పీ జయప్రకాష్

బంగారుపాళ్యం, అక్టోబరు 1: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ మంగళవారం పరిశీలించారు. బాధితులకు అందుతున్న సేవలను ఆరా తీశారు. అనంతరం 30 పడకలతో నూతనంగా ఏర్పాటు చేసిన ఆస్పత్రిని కూడా తనిఖీ చేసి, రోగులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారి శిరీషకు సూచించారు. అలాగే తగ్గువారిపల్లెలోని అంగన్వాడీ కేంద్రాన్ని కూడా పరిశీలించారు. అక్కడ టీచర్ సూర్యకుమారి లేకపోవడంతో సంబంధిత అధికారులకు ఫోన్‌చేసి తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు కమలనాథరెడ్డి, జనార్ధన గౌడ్, హేమచంద్రనాయుడు, కొండేటి శివ, రాధాకృష్ణమ నాయుడు, లోకనాథనాయుడు, సర్దార్, జాకీర్ హుస్సేన్, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారుకు సన్మానం



శ్రావణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న టీడీపీ నేతలు

పెనుమూరు, అక్టోబరు 1: పెనుమూరుకు నూతనంగా విచ్చేసిన తహసీల్దారు శ్రావణ్‌కుమార్‌ను మంగళవారం టీడీపీ నేతలు సన్మానించారు. నాయకులు కృష్ణమూర్తినాయుడు, యువరాజులు నాయుడు, ఎస్ఎస్‌నాయుడు, పంగుళూరి కిషోర్, హరిబాబు, మురళీనాయుడు, హేమాద్రినాయుడు, తులసినాయుడు, రామచంద్రనాయుడు పాల్గొన్నారు.

ఉపాధి పనులను గ్రామసభల్లో గుర్తించండి

పెనుమూరు, అక్టోబరు 1: రాబోవు ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పనుల ఎంపిక ప్లానింగ్ ప్రాసెస్ గురించి గ్రామసభల్లో గుర్తించి కార్యదర్శులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో తీర్మానం చేయాలని ఎంపీడీవో నీలకంఠేశ్వర్ రెడ్డి సూచించారు. మంగళవారం తన కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. 2,3,4 తేదీల్లో మండలంలో జరిగే గ్రామసభల్లో రైతులకు ఉపయోగపడే పర్యావరణ పరిరక్షణ పనులను గుర్తించాలని తెలిపారు. ఏపీవో గుణశేఖర్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు సలహాలిచ్చిన అధికారులు

పెనుమూరు, అక్టోబరు 1: చార్వాగానిపల్లె పంచాయతీలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులతో కలిసి నిర్వహించారు. వ్యవసాయ శాఖ కార్యాలయంలో దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆ శాఖ డీడీఏ నాగపద్మిని, సెరికల్చర్ ఎస్వో వెంకటలక్ష్మి ఆవిష్కరించారు. అనంతరం రైతుల పొలాలను పరిశీలించి, సలహాలిచ్చారు. పూతలపట్టు ఏవో మధురవాణి, ఏడీఏ మోహన్‌బాబు, జేడీఏ శోభారాణి, వెటర్నరీ ఏడీఏ గీత, సప్తగిరి బ్యాంకు మేనేజరు నాగరాజు, డీసీసీబీ బ్యాంకు మేనేజరు మణికంఠ పాల్గొన్నారు.

వెదురుకుప్పం: కార్వేటినగరం మండలం గోపిశెట్టిపల్లి, లక్ష్మీరాజుపేట ఈదులవారిపల్లి, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో పంట పొలాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ క్రమంలో ఏవో హేమలత టీం రైతులకు అవగాహన కల్పించి, ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.

గుడిపాల: కొత్తపల్లి, ముట్టుకూరుపల్లెలో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయాధికారి మాధవి, పశువైద్యాధికారి సాయిసుధ, సిబ్బంది తులసిరెడ్డి, భువనేశ్వరి, టీడీపీ నేతలు చల్లా, మహదేవ, రమేష్, సెల్వినాథన్, బాబు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం



పెనుమూరు, అక్టోబరు 1: కావూరివారిపల్లె వద్ద ఉన్న పార్వతీపరమేశ్వర రుణమోజనేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం శివపార్వతుల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. గ్రామానికి చెందిన మేఘశ్యాంపిళ్లై దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త కృపానందంపిళ్లై, నిర్వాహకుడు నాగరాజు పాల్గొన్నారు.

బంగారమ్మకు పూజలు



వెదురుకుప్పం, అక్టోబరు 1: కార్వేటినగరంలోని గ్రామ దేవత బంగారమ్మకు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు రంగనాథమొదలియార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విద్యాసామగ్రి వితరణ



విజయపురం, అక్టోబరు 1: జగన్నాథపురం ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు చంద్రయ్య విద్యాసామగ్రి వితరణ చేశారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్నవారికి పెన్నులు, పెన్సిల్, నోటుపుస్తకాలు అందించారు. హెచ్ఎం ఉమాశంకర్, టీచర్ బాబు, రిటైర్డు టీచర్ దొరస్వామి, అంగన్వాడీ కార్యకర్త చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల దినోత్సవం



కార్వేటినగరం వృద్ధాశ్రమంలో..

వెదురుకుప్పం, అక్టోబరు 1: కార్వేటినగరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సోమవారం వృద్ధుల దినోత్సవాన్ని జరుపుకున్నారు. వృద్ధులకు ఆరోగ్య సూత్రాల పట్ల అవగాహన కల్పించారు. డాక్టర్లు గోపినాథ్, కీర్తి, శృతిభాగ్యం, శృతి, యూసఫ్ పాల్గొన్నారు. వృద్ధాశ్రమంలో జరిగిన కార్యక్రమంలో వృద్ధులకు అన్నదానంతోపాటు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు.

చిత్తూరులో నేడు వీహెచ్‌పీ ర్యాలీ

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 1: తిరుమల శ్రీవారి లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారంపై బుధవారం నగరంలో వీహెచ్‌పీ నాయకులు శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు నాయకులు సురేందర్‌రెడ్డి, రామమూర్తి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

వైసీపీ ప్రభుత్వంలోనే టీటీడీలో అనేక అక్రమాలు

● టీడీపీ నాయకుల ఆరోపణ



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, అక్టోబరు 1: వైసీపీ ప్రభుత్వంలోనే టీటీడీలో అనేక అక్రమాలు జరిగాయని టీడీపీ నేతలు ఆరోపించారు. మంగళవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. వైసీపీ హయాంలో జరిగిన అక్రమాలపై ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని కోరారు. హిందువులు అతి పవిత్రంగా భావించే లడ్డూలో వినియోగించే నెయ్యిలో నాణ్యత లేదని గతంలో చాలా మంది ఫిర్యాదు చేశారని అన్నారు. ఎన్‌డీడీబీ వారు ఇచ్చిన రిపోర్టులో కూడా నెయ్యిలో జంతువుల కొవ్వు కలసిందని రిపోర్టు ఇచ్చారని చెప్పారు. ఇవేకాక ఇంకా అనేక కాంట్రాక్టుల్లో అక్రమాలు జరిగాయన్నారు. లడ్డూ విషయంలో సుప్రీంకోర్టు చెప్పిన విషయాలను వైసీపీ నేతలు వక్రీకరించి ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నేతలు సప్తగిరి ప్రసాద్, సునీల్ కుమార్ చౌదరి, మోహన్‌రాజ్, ఫిరోజ్ ఖాన్, రాజశేఖర్, గోపాల్, అత్తుబాయ్, బాబురెడ్డి, జిలాని తదితరులు పాల్గొన్నారు.





బొమ్మసముద్రం గేటు వద్ద పూర్తికాని పనులతో ఇబ్బంది పడుతున్న స్థానికులు

నత్తనడకన హైవే నిర్మాణ పనులు

తీవ్ర ఇబ్బంది పడుతున్న జనం

గుడిపాల, అక్టోబరు 1: బెంగళూరు-చెన్నై జాతీయ రహదారి పనులు నత్తనడకన సాగుతుండటంతో జనం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నంగమంగళం క్రాస్ నుంచి బొమ్మసముద్రం క్రాస్, గట్రాళ్ల మిట్ట, నంగమంగళం, కనకనేరి, శాంతిపురం, ముస్లిరికుప్పం, గురుగునత్తం, మండికృష్ణాపురంవాసులు తమ గ్రామాలకు వెళ్లాలంటే బస్సులు, ఆటోలకు చార్జీలు చెల్లించలేకున్నారు. మరోవైపు సర్వీసు రోడ్లు పూర్తిగా వేయలేదు. దీనివల్ల బొమ్మసముద్రం క్రాస్ మీదుగా చింతగుంటూరు వయా పల్లూరు నుంచి వాహనాలు వేలూరు వైపు వెళ్లే వాహనదారులు.. నంగమంగళం స్టేట్ బ్యాంకు నుంచి గట్రాళ్ల మిట్ట మీదుగా గురుగునత్తం రైల్వే బ్రిడ్జి కింద చెన్నై వైపు వెళ్లేవారూ ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా సర్వీసు రోడ్లు పూర్తి చేయడమో, హైవే పనులైనా త్వరగా పూర్తి చేసి.. సమస్యను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ



కార్వేటినగరం మండలం పాదిరికుప్పంలో వృద్ధురాలికి పింఛను సొమ్ము అందజేస్తున్న ఎమ్మెల్యే థామస్

వెదురుకుప్పం, అక్టోబరు 1: కార్వేటినగరం మండలం పాదిరికుప్పంలో మంగళవారం 'ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల' సొమ్మును లబ్ధిదారులకు గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే థామస్ అందజేశారు. కార్వేటినగరం టీడీపీ అధ్యక్షుడు చెంగల్రాయరెడ్డి, జిల్లా యువత కార్యనిర్వాహక కార్యదర్శి బీగాల రమేష్, టీడీపీ నాయకులు హేమంత్‌రెడ్డి, దాము, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి యుగంధర్ పాల్గొన్నారు.

● వెదురుకుప్పం మండలం మొండివెంగనపల్లెలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల సొమ్మును టీఎన్‌టీయూసీ జీడీనెల్లూరు ఉపాధ్యక్షుడు పోటుగారి గంగయ్య అందజేశారు. నల్లవెంగనపల్లెలో టీఎన్‌టీయూసీ జీడీనెల్లూరు అధ్యక్షుడు గాలి బాబునాయుడు అందించారు. ఆళ్ళమడుగులో తెలుగు యువత ఉపాధ్యక్షుడు బోడిరెడ్డి సుధాకర్‌రెడ్డి అందించారు.

గంగాధరనెల్లూరు: మండలంలోని నెల్లేపల్లె పంచాయతీ అప్పిరెడ్డి కండ్రిగలో టీడీపీ నేతలతో కలిసి లబ్ధిదారులకు పింఛను సొమ్మును ఎమ్మెల్యే థామస్ పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు శ్రీధర్‌యాదవ్, వెంకటేష్, స్వామిదాస్, కోదండరెడ్డి, వెంకటపతిరెడ్డి, దేవరాజులునాయుడు, వెంకటేష్‌యాదవ్, జయరామిరెడ్డి, పొడుగు దేవరాజులు, మునికృష్ణారెడ్డి, జ్యోతీశ్వర్, శ్రీనివాసులు, భూపాల్, చిరంజీవి, సతీష్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పాలసముద్రం: మండలంలో 3,636 లబ్ధిదారులకుగాను 3,045 మందికి తొలిరోజే పింఛన్లు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు శేఖర్‌రాజు, వాసునాయుడు, జె.విజయ్‌కుమార్, అరుణ్‌నాథన్, సాంబశివన్, వెంకటేశులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: తగ్గువారిపల్లె పంచాయతీలో లబ్ధిదారులకు పింఛన్లను మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ మంగళవారం పంపిణీ చేశారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుడిపాల: మండలంలో 6903 పింఛన్లకు గాను 6,736 పంపిణీ చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో ఉపేంద్ర తెలిపారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, మహిళా పోలీసు సూర్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మంత్రులను కలసిన చిత్తూరు టీడీపీ నేతలు



హోంమంత్రి అనితను సన్మానిస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, అక్టోబరు 1: విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, హోంమంత్రి వంగలపూడి అనితను టీడీపీ నేతలు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో.. చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు సునీల్ కుమార్ చౌదరి, రాష్ట్ర వన్నియకుల క్షత్రియ సంఘం కార్యదర్శి విజయ్‌కుమార్, కిషోర్, ధరణి తదితరులు ఉన్నారు.

నేడు మాంసం అమ్మరాదు: కమిషనర్

చిత్తూరు, అక్టోబరు 1: గాంధీ జయంతి సందర్భంగా బుధవారం నగరపాలక సంస్థ పరిధిలో ఎక్కడా మాంసం దుకాణాలు తెరవకూడదని కమిషనర్ నరసింహ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలు మీరితే ట్రేడ్ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

'పద్మశాలి' కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం



గంజి మాధవయ్యను సన్మానిస్తున్న నగరి వాసులు

నగరి అక్టోబరు 1: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి సంక్షేమ,చ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన గంజి మాధవయ్యను మంగళవారం నగరివాసులు ఘనంగా సన్మానించారు. చేనేత, మరమగ్గ కార్మికుల సంక్షేమం కోసం కృషి చేయాలని కోరారు. సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, జ్యోతినాయుడు, గుణశేఖర్, రాజశేఖర్, శేఖర్, శ్రీధర్, సలీమ్, మదన్‌మోహన్, మురళి తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో పవిత్రోత్సవాలు వాయిదా

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 1: కోదండరామాలయంలో బుధవారం నుంచి నిర్వహించాల్సిన పవిత్రోత్సవాలు అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు ఈవో సుబ్రహ్మణ్యంనాయుడు తెలిపారు. నవంబరు ఒకటో తేదీ నుంచి నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం వహించొద్దు

యాదమరి, అక్టోబరు 1: దిగువ కనతలచెరువు దళితవాడలో మంగళవారం రెవెన్యూ సిబ్బందితో కలిసి తహసీల్దార్ పార్థసారథి పర్యటించారు. కలెక్టర్ ఆదేశాలమేరకు దళితవాడల్లోని ప్రజలకు అవసరమైన ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం లేకుండా ఇవ్వాలని ఆదేశించారు. ఆర్ఐ ప్రసాద్, వీఆర్వోలు జశ్వంత్ కుమార్, శ్రీనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

250 మందికి వైద్య పరీక్షలు

పూతలపట్టు, అక్టోబరు 1: ఎర్రచెరువుపల్లె గ్రామంలో బెంగళూరుకు చెందిన వైదేహి ఆస్పత్రి వైద్యులు మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి స్పందన లభించింది. చుట్టుపక్కల గ్రామాల్లోని సుమారు 250 మందికి పలురకాల వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. స్థానిక నాయకులు ఇంద్రసేన నాయుడు, రెడ్డెప్ప నాయుడు, చిన్నబ్బ నాయుడు పాల్గొన్నారు.

చిత్తూరు ఆర్డీవో బాధ్యతల స్వీకరణ



శ్రీనివాసులు

చిత్తూరు రూరల్, అక్టోబరు 1: చిత్తూరు ఆర్డీవోగా శ్రీనివాసులు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నెల్లూరు జిల్లాలో తెలుగంగ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తూ ఇక్కడికొచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న చిన్నయ్యను ప్రభుత్వ కార్యదర్శి వద్ద రిపోర్ట్ చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారానికి తొలి ప్రాధాన్యమిస్తానని చెప్పారు.

కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్డీవో

చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరు ఆర్డీవో మంగళవారం సాయంత్రం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. భూసమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆయనకు కలెక్టర్ సూచించారు.

నగరి ఎక్సైజ్ సీఐ బాధ్యతల స్వీకరణ



శ్రీనివాసులురెడ్డి

నగరి అక్టోబరు 1: నగరి ఎక్సైజ్ సీఐగా శ్రీనివాసులురెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తుండిన మాధవి బదిలీపై వెళ్లడంతో సత్యసాయిజిల్లా పెనుగొండ నుంచి నగరికి శ్రీనివాసులురెడ్డి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సారా అమ్మకాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

జాతీయ రహదారిపై నిలిచిన వర్షపునీరు



నరహరిపేట పోలీసుస్టేషన్ వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

గుడిపాల, అక్టోబరు 1: చిత్తూరు - వేలూరు, బెంగళూరు - చెన్నై జాతీయ రహదారిలో మలుపులు ఎక్కువ. ఆపై వర్షపు నీరు నిలవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.





విజయం సీబీఎస్ఈ, నారాయణ పాఠశాలల్లో విద్యార్థుల సందడి

ముందస్తు దసరా సంబరాలు

చిత్తూరు (సెంట్రల్), అక్టోబరు 1: విజయం సీబీఎస్ఈ పాఠశాలలో ముందస్తు దసరా సంబరాలు నిర్వహించారు. విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి, అకడమిక్ డైరెక్టర్ శైలజామూర్తి ఆధ్వర్యంలో విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నగరి: మున్సిపాలిటీ పరిధిలోని నారాయణ పాఠశాలలో మంగళవారం ముందస్తు దసరా సంబరాలు జరుపుకున్నారు. ఏజీఎం శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక



టీడీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే థామస్

శ్రీరంగరాజపురం, అక్టోబరు 1: రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని జీడీనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అన్నారు. మంగళవారం ఎస్ఆర్‌పురం గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా గంగమ్మగుడి ఆలయ ధర్మకర్త లింగారెడ్డి, కమిటీ సభ్యుడు సుధాకర్ నాయుడులు ఎమ్మెల్యే సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. రాజశేఖర్ నాయుడు, భాస్కర్ నాయుడు, సిద్ధయ్యశెట్టి, సూరిరెడ్డి, ఎత్తిరాజులు నాయుడు, హేమాద్రి యాదవ్, నిరంజన్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు, గిరి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీఐకి సన్మానం



గంగాధరనెల్లూరు, అక్టోబరు 1: గంగాధరనెల్లూరు పోలీస్‌స్టేషన్‌కు కొత్త సీఐగా వచ్చిన లక్ష్మీనారాయణను మంగళవారం టీడీపీ నేతలు సన్మానించారు. పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, మండల అధ్యక్షుడు స్వామిదాస్, పార్లమెంట్ ఉపాధ్యక్షుడు వెంకటేష్, జిల్లా టీడీపీ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, పార్లమెంట్ టీడీపీ ఎస్సీ సెల్ ప్రధానకార్యదర్శి దేవసుందరం, బొడపాటి బాబునాయుడు, జ్యోతిరెడ్డి, వెంకటేష్‌యాదవ్, మాధవరెడ్డి, వరదరాజులు, జాన్, చిన్నా, బుజ్జిబాబు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన కానిస్టేబుళ్లకు సత్కారం



ఐరాల(కాణిపాకం), అక్టోబరు 1: కాణిపాకం పోలీస్ స్టేషన్ పరిధిలో ఐదేళ్లుగా సేవలందించి బదిలీపై వెళుతున్న కానిస్టేబుళ్లను మంగళవారం ఎస్ఐ ధరణీధర సత్కరించారు. సత్కారం అందుకున్నవారిలో.. నవీన్, తనికాచలం, నరసింహశెట్టి, రాజేష్ ఉన్నారు.

గ్రామ సభలు సక్రమంగా నిర్వహించాలి

పాలసముద్రం, అక్టోబరు 1: గాంధీ జయంతి సందర్భంగా బుధవారం అన్ని పంచాయతీల్లో గ్రామ సభలను సక్రమంగా నిర్వహించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో విద్యావతి ఆదేశించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈవోపీఆర్డీ రమేష్, ఏపీవో మార్గరేట్, ఈసీ అనూష తదితరులు పాల్గొన్నారు.

తప్పనిసరిగా హెల్మెట్ ధరించండి



డీఈవో కార్యాలయ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న నిత్యబాబు

చిత్తూరు (సెంట్రల్), అక్టోబరు 1: ప్రాణ రక్షణకు ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ సీఐ నిత్యబాబు సూచించారు. మంగళవారం డీఈవో కార్యాలయంలో సిబ్బందికి హెల్మెట్‌ధారణపై అవగాహన కల్పించారు.

శిథిలావస్థలో వంతెనలు





ధ్వంసమైన వంతెన గోడలు - పిచ్చిమొక్కలతో అధ్వానంగా ఉన్న వంతెన

యాదమరి, అక్టోబరు 1: యాదమరిలో ప్రవహించే నీవానదిపై నిర్మించిన రెండు భారీ వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నాయి. బ్రిటీష్ కాలం నాటివి కావడంతో భారీస్థాయి వాహనాలు, గ్రానైట్ లారీలు ప్రయాణిస్తుండడంతో వంతెన గోడలు బీటలు వారి ప్రమాదకరస్థాయికి చేరుకున్నాయి. చిత్తూరు నుంచి తమిళనాడు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు దగ్గర మార్గంగా చిత్తూరు - గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారిని వినియోగిస్తారు. వైసీపీ హయాంలో ఈ రహదారి నిర్వహణ గాలికొదిలేయడంతో వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నాయని స్థానికులు చెబుతున్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

చిత్తూరు, అక్టోబరు 1: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని కొంగారెడ్డిపల్లెలో ధర్మరాజులుగుడి వద్ద తన సోదరుడు జ్యోతీశ్వర్‌రెడ్డితో కలిసి కారు పార్కింగ్‌ను పెట్టుకుని వినోద్‌కుమార్ జీవనం సాగిస్తున్నాడు. భార్య, కుమార్తె బెంగళూరులో ఉండగా, కుమారుడు చరణ్ ఇంగ్లాండ్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. మరోవైపు కుటుంబీకుల మధ్య తరచూ కలహాలు జరుగుతుండటంతో మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం ఉదయం 6.30 గంటలకు కారు పార్కింగ్ వద్దకు వచ్చి తనతో తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. వాచ్‌మేన్ గమనించి సోదరుడికి ఫోన్ చేసి, విషయం చెప్పాడు. అతను వెంటనే వచ్చి వినోద్ కుమార్‌ను చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వేలూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. సీఐ నెట్టికంఠయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెకుముకి పోటీల విజేతలకు బహుమతులు

చిత్తూరు (సెంట్రల్), అక్టోబరు 1: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం బృందావన్ పాఠశాలతోపాటు నగరంలోని మరిన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చెకుముకి పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన 108 మంది విద్యార్థులు 36 బృందాలుగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. సమగ్రశిక్ష సీఎంవో జయప్రకాష్, నిర్వాహకులు పాల్గొన్నారు.

నగరి: బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన పోటీల్లో కొత్తపేట, సత్రవాడ, చింతలపట్టెడ ఉన్నతపాఠశాలల విద్యార్థులు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించినట్లు ఎంఈవో నమశ్శివాయ తెలిపారు.

విజయపురం: జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన పోటీల్లో విజయపురం, గంగమాంబాపురం,జంబాడ విద్యార్థులు విజేతలుగానిలిచారు.

యాదమరి: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన పోటీల్లో యాదమరి, కె.గొల్లపల్లి, వరిగపల్లి ఉన్నత పాఠశాలల విద్యార్థులు విజేతలుగా నిలిచారు.

వెదురుకుప్పం: కార్వేటినగరంలో జరిగిన పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

6న జ్యోతి రామలింగస్వామి జయంత్యుత్సవాలు

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 1: బ్రాహ్మణవీధి శీర్ కరుణీకర్ అభ్యుదయ సంఘం కార్యాలయంలో ఈనెల 6వ తేదీన జ్యోతి రామలింగస్వామి జయంత్యుత్సవాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ప్రసాద్‌కుమార్, కేవీ ద్యుమణి తెలిపారు. అగవల్ పారాయణం, పతాక ఆవిష్కరణ, చిత్రపటం ఊరేగింపు, ఉత్తమ విద్యార్థులకు నగదు బహూకరణ, అన్నదానం ఉంటాయన్నారు.